ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 3, డిసెంబరు 2024

తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, మీర్జపేట, తర్లుపాడు, సీతానాగులవరంలో మిరపను ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.లక్షపైనే ఖర్చయ్యింది. ఈ సమయంలో కుచ్చుముడత తెగులు విజృంభించడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది పంట కూడా ప్రస్తుతం అదేస్థితిలో ఉంది. మంగు వాతావరణంతో తెగుళ్లు వ్యాపించాయి. శనగ పంటకు పచ్చపురుగు సోకింది. మిర్చికి ఆశించిన తెగుళ్ల నివారణకు సలహాలు ఇవ్వాల్సిన ఉద్యానశాఖ అధికారులు పత్తా లేరు. వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కూడా ఏం చెప్పడం లేదు.


తర్లుపాడు వద్ద తెగులు ఆశించిన కంది పైరు

జిల్లాలో పంటలపై తెగుళ్లు, పురుగులు విజృంభిస్తున్నాయి. రైతులకు చుక్కలు చూపెడుతున్నాయి. వాటిని అదుపు చేసేందుకు నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఐదు రోజుల నుంచి మబ్బులు కమ్ముకోవడంతో పైర్లపై వివిధ రకాల తెగుళ్ల దాడి తీవ్రమైంది. ముఖ్యంగా మిరపకు కుచ్చు ముడత సోకింది. ఖరీఫ్‌లో సాగు చేసిన శనగలో పచ్చపురుగు ఉధృతంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పూతదశలో ఉన్న కందికి పచ్చ పురుగు, ఎండు తెగులు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదు. రెండేళ్ల నుంచి మిర్చి వేసిన రైతులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొంతమంది రైతులు కాయలు కోసేస్తున్నారు. మిగతా పంటల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది.

పురుగులు.. తెగుళ్లు

నివారణ కోసం రూ.100 కోట్ల వరకు వ్యయం

పంటల కీలక దశలో తెగుళ్లు

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 4.01 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అందులో ప్రధానంగా లక్షా 75వేల ఎకరాల్లో కంది, 56వేల ఎకరాల్లో మిర్చి, 30వేల ఎకరాల్లో పత్తి, 24వేల ఎకరాల్లో వరి, 16వేల ఎకరాల్లో సజ్జ, 8వేల ఎకరాల్లో నువ్వు వంటివి ఉన్నాయి. వాటిలో సజ్జ, నువ్వు కోతలు పూర్తయ్యాయి. మిగిలిన వాటిలో ఎదుగుదల దశలో కొన్ని.. పూత, పిందె, కాయ దశల్లో మరికొన్ని ఉన్నాయి. అలాగే రబీ పంటలు ఇప్పటివరకు సుమారు లక్షా 40వేల ఎకరాల్లో సాగు చేశారు. అందులో 50 వేల ఎకరాల్లో పొగాకు, 25వేల ఎకరాల్లో మినుము, మరో 25వేల ఎకరాల్లో శనగ, 15 వేల ఎకరాల్లో వరి, 8వేల ఎకరాల్లో మిర్చి, 8వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15 వేల ఎకరాల్లో అలసంద ఉంది. ఈ పైర్లలో అధిక భాగం ఎదుగుదల దశలో, మరికొన్ని మొలక దశలో ఉన్నాయి. అలా అటు ఖరీఫ్, ఇటు రబీ పైర్లన్నింటికీ ప్రస్తుత సమయం చాలా కీలకమైనది. ఈ దశలో తెగుళ్ల విజృంభించాయి.

ఒంగోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పైర్లను ప్రస్తుత వాతావరణం తీవ్రంగా దెబ్బతీస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం జిల్లాపై పెద్దగా లేదని ఊపిరిపీల్చుకున్న రైతులకు మరో విధంగా దెబ్బతగిలింది. తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా నెలకొన్న మంగు వాతావరణం పంటలను తీవ్రంగా నష్టపరుస్తోంది. ఎదుగుదల, పూత, పిందె దశలో ఉన్న పలు పైర్లపై ప్రస్తుతం తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరిగింది. వీటి ప్రభావం ప్రధాన పంటలు, ప్రత్యేకించి ఖరీఫ్‌లో సాగై ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న కంది, మిర్చి, మినుము, వరి, పొగాకు తదితర వాటిపై అధికంగా కనిపిస్తోంది. ఇలాంటి వాతావరణ పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే పంటలు దెబ్బతిని

మిగతా 6వ పేజీలో

- అయినా అదుపులోకి రాని పరిస్థితి
- తాజా వాతావరణంతో మరింత ఉధృతి
- పంటలను పీల్చిపిప్పి చేస్తున్న చీడపీడలు
- దిగుబడులపైనా తీవ్ర ప్రభావం
- నష్టపోతామని రైతుల్లో ఆందోళన
- మంగు వాతావరణం కొనసాగితే భారీ నష్టం

గిట్టుబాటు ధర కల్పిస్తేనే బయటపడతాం



ఆరుగాలం కష్టించి పండించిన మిరపకు తెగుళ్లు ఆశించడంతో ఇప్పటికే నష్టపోయాం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇతర దేశాలకు ఎగుమతులు చేయాలి. కనీసం క్వింటాకు రూ.20వేలు గిట్టుబాటు ధర కల్పిస్తేనే అప్పుల ఊబి నుంచి బయటపడతాం.

- పత్తి చిన్నకాశయ్య, తిమ్మాపురం, దోర్నాల మండలం


దోర్నాలలో తెగులు ఆశించిన మిర్చిపై మందు పిచికారీ చేస్తున్న రైతు


ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలు పొందిన శ్రుతి, వెంకటేష్‌లను అభినందిస్తున్న పీడీ ప్రతిమ

సంకల్ప యోగం

- ఆసనాల్లో రాణిస్తున్న చందలూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పలు విజయాలు
- అంతర్జాతీయ స్థాయికి చేరాలన్నదే లక్ష్యం

7



కొండెక్కిన కోడిగుడ్డు

చిల్లర దుకాణాల్లో ఒక్కొక్కటి రూ.8

పామూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల ధరలు అమాంతం పెరిగాయి. గుడ్డు హోల్‌సేల్‌లోనే రూ.7కు చేరింది. వంద గుడ్ల ధర రూ.700 పలుకుతోంది. చిల్లర దుకాణాల్లో ఒక్కో గుడ్డు రూ.8కు విక్రయిస్తున్నారు. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడం, కార్తీక మాసం ముగియడం కూడా ధరల పెరుగుదలకు కారణమని చెప్తున్నారు.



లీకులు ఎక్కువ.. నిల్వ తక్కువ!

చినకండ్లేరు చెరువు లీకుల నుంచి కాలువలో వృథాగా పోతున్ననీరు

- చిన్న కండ్లేరు చెరువు పరిస్థితి ఇదీ
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- లీకులతో వృథాగాపోతున్న నీరు
- చెరువు ఖాళీ అయితే వేసవిలో ఎద్దడి ప్రమాదం

వివరాలు 7వ పేజీలో

ముఖ హాజరు తంటా

రోజుకు రెండుసార్లు వేయాల్సిందే

- సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన
- ఒకపూట వేసే అది సెలవు లెక్కే
- విధులకు డుమ్మాకొడుతున్న వారి ఆటలకు చెక్
- జిల్లావ్యాప్తంగా అమలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఇక రోజూ రెండుసార్లు ముఖ హాజరు వేయాల్సిందే. ఆ మేరకు ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం నుంచే అమలు చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఎక్కువ మంది విధులకు ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో వలంటీర్లను ఏర్పాటు చేయడంతో వారి ద్వారానే సచివాలయ ఉద్యోగులు పనిచేయిస్తూ కాలం వెల్లబుచ్చారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై దృష్టిసారించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు ఉండటం లేదు. ఈ విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో లేదా వార్డులో పరిశీలనకు వెళ్లారు, మండల కేంద్రానికి వెళ్లారు అంటూ రకరకాల కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీతోపాటు

మిగతా 6వ పేజీలో


ఒంగోలులో ముఖ హాజరు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆర్జీవీకి హైకోర్టులో ఊరట

- 9 వరకు అరెస్టు చేయవద్దని ఆదేశం



ఒంగోలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైకోర్టులో ఊరట లభించింది. మద్దిపాడు పోలీసు స్టేషన్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రామ్‌గోపాల్‌వర్మపై కేసులు నమోదైన విషయం విదితమే. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై ఆర్జీవీ అసభ్యకరంగా పెట్టిన పోస్టులతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని కొందరు ఫిర్యాదులు చేయగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 9కి వాయిదా వేసిన న్యాయమూర్తి అప్పటివరకు రామ్‌గోపాల్‌వర్మను అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించారు.


మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఉన్న కోనేరులో దీపాలు వదులుతున్న మహిళలు


ఒంగోలులోని రంగారాయుడు చెరువులో దీపాలు వదులుతున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి

కార్తీక మాసం ముగిసిన మరుసటి రోజు నిర్వహించే పోలి పాడ్యమిని భక్తులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జామునే దీపాలు వెలిగించి అరటి దోనెల్లో ఉంచి అందుబాటులో ఉన్న కోనేరులు, చెరువులు, నీటి కుంటల్లో వదిలారు. అనంతరం శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

- ఒంగోలు కల్చరల్

7న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

- పండుగ వాతావరణంలో నిర్వహించాలి
- కలెక్టర్ అన్సారియా ఆదేశం

6

అంతా పారదర్శకమే

రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- నెల రోజుల్లో 75మంది డీలర్లపై 6ఏ కేసులు
- జిల్లా వ్యాప్తంగా 3,585 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం, 42 కేసులు నమోదు
- 'ఆంధ్రజ్యోతి'తో డీఎస్‌వో పద్మశ్రీ



6

సరిలేరు మీకెవ్వరు..

వారంతా విభిన్న ప్రతిభావంతులు. కొందరు బధిరులు. మరికొందరికి వైకల్యం. ఇంకొందరికి బుద్ధిమాంద్యం. అయినా అధైర్య పడకుండా అంగవైకల్యాన్ని ఎదిరించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూల్‌లో సోమవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో పాల్గొని అదరగొట్టారు. వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విభిన్న ప్రతిభావంతులు ఆయా విభాగాల్లో సత్తా చాటారు. వీరి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి నెలకొంది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్



7న పేరెంట్, టీచర్స్ మీటింగ్

● పండుగ వాతావరణంలో నిర్వహించాలి ● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 7వతేదీన జరిగే మెగా పేరెంట్స్-ఉపాధ్యాయుల మీటింగ్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అన్ని పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు వేర్వేరుగా పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఈ కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రీయ బాలసురక్ష కింద విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం పెట్టే భోజనానికి అదనంగా మరో మూడు రుచికరమైన ప్రత్యేక వంటలను ఆ రోజు విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ చేసే క్రమంలో ఎదురయ్యే ఆధార్ కార్డు సవరణ సమస్యలను త్వరగా పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇంటిని ఫొటో తీసి జియోట్యాగింగ్ చేయాలని, అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా హ్యాబిటేషన్లు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లతో సహా సచివాలయ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజరు ఖచ్చితంగా వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్య ఘర్ పథకం కింద సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు వెంకటనాయుడు, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, రాజశేఖర్, రమేష్, జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం అందించాలి

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్‌లో పేదలకు నాణ్యమైన భోజనం అందించాలని కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని ఓ అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం అందించడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనరు స్పందించారు. ఈ మేరకు నగరంలోని అన్న క్యాంటీన్‌ల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన భోజనం తక్కువ ధరకు అందించాలని సంకల్పించిందన్నారు. అందులో భాగంగా ప్రతి పేదవాడు సంతోషంగా అన్నం తినాల్సి ఉందన్నారు. అయితే ఓ క్యాంటీన్‌లో భోజనం సరిగా లేదని, సిబ్బంది విసుక్కుంటున్నారన్న ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రజలు సంతోషంగా కడుపు నిండా తినాలని వారి సంతోషం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని కమిషనరు హెచ్చరించారు.

ముఖ హాజరు తంటా

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల అమలు, పలురకాల విధులను కేటాయించింది. వాటితోపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూట ఇతర ఉద్యోగుల తరహాలో ముఖహాజరు తప్పనిసరిగా వేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సచివాలయాల్లో ఇష్టారీతిన వ్యవహరించిన ఉద్యోగులు తాజా ఉత్తర్వులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సాధారణంగా ఒకపూట ముఖ హాజరు వేసి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో మరొకసారి హాజరు వేయాల్సి ఉంది. కానీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఉదయం పదిన్నర లోపు, సాయంత్రం ఐదు గంటలకు తప్పని సరిగా ముఖహాజరు వేస్తేనే ఆ రోజు విధుల్లో ఉన్నట్లు లెక్క. ఒకపూట వేయకపోయినా ఆ రోజు సెలవు కింద పరిగణిస్తారు. ఈ ముఖ హాజరు కూడా ఆ సచివాలయ పరిధిలోని 500 మీటర్ల లోపే వేయాల్సి ఉంది. ఎక్కడో కూర్చొని హాజరు వేయాలనుకుంటే ఇక కుదరదు. జిల్లాలో ఉన్న 712 సచివాలయాల్లో 6,300 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కో సచివాలయంలో సరాసరిన పది విభాగాల ఉద్యోగులు ఉన్నారు. వారందరూ ఇప్పుడు తప్పనిసరిగా ముఖహాజరు వేయాల్సి రావడంతో వారిలో ఆందోళన నెలకొంది.

ఇష్టారాజ్యం ఇక కుదరదు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేయాల్సిన సచివాలయాల్లో కొన్ని విభాగాల ఉద్యోగులు ఇప్పటి వరకూ విధులకు ఎప్పుడు హాజరువుతారో కూడా తెలియదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిర్ణయం తీసుకోవడం వారికి మింగుడు పడటం లేదు. కాగా కొన్ని విభాగాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు విధులకు ఉదయం ఆరు గంటలకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి ఉద్యోగుల విషయంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్లు, ఏఎన్ఎం, వీఆర్వో లాంటి వారు నిరంతరం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఉండాలి. వారు ఉదయం వెళితే సాయంత్రం వరకు విధుల్లో ఉండాల్సి వస్తుంది. అలాంటి వారి పట్ల ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆ విభాగాల ఉద్యోగులు వేచిచూస్తున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 65 ఫిర్యాదులు

ఒంగోలు (క్రైం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో 65 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కార్యాలయంలో గల గెలాక్సీ భవన్‌లో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను వివిధ ప్రాతాల నుంచి వచ్చినవారు నేరుగా కలిసి తమ సమస్యల విన్నవించారు. దీంతో స్పందించిన ఎస్పీ ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారలతో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు సూర్యనారయణ, దేవప్రభకర్, నాగరాజు, ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, రజియా సుల్తానా పాల్గొన్నారు.

జిల్లాలో 10.7 మి.మీ. వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 10.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెలిగండ్ల 53.4, పీసీపల్లి 52.8, జరుగుమల్లి 38.8, పొన్నలూరు 36.4, సింగరాయకొండ 36.4, పామూరు 35.4, టంగుటూరు 18.4, సీఎస్‌పురం 18.2, హనుమంతునిపాడు 17.6, కొమరోలు మండలంలో 15.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో 15 మండలాల్లో 1.0 మి.మీ. నుంచి 9.2 మి.మీ. వరకు వర్షపాతం నమోదైంది.

నిద్రిస్తున్న వ్యక్తిపై దూసుకుపోయిన కారు

» అక్కడికక్కడే మృతి » రోడ్డు పక్కనే చీకట్లో ఉండడం, చూడకుండా వాహనం నడపడమే ప్రమాదానికి కారణం

ఈపూరుపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం శివాలయం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ పరిధిలోని సీతారామపేటకు చెందిన ఎలిబోలు సత్యనారాయణ(56) తన భార్యతో 15 ఏళ్ల కిందట విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో స్థానికంగా ఉన్న శివాలయం ముందు రోడ్డు పక్కన నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి, పైగా చీకటి కావడంతో గమనించని తోటవారిపాలెంకు చెందిన కారు డ్రైవర్ జంజనం శ్రీనివాసరావు నిదిరిస్తున్న వ్యక్తిపైకి కారు ఎక్కించాడు. దీం తో సత్యనారాయణ అక్కడిక క్కడే మృతిచెందారు. డ్రైవర్ ఈపూరుపాలెం పో లీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సైడ్ డ్రెయిన్‌లో పడి బత్తుల ఆనందరావు(40) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం రామకూరుకు చెందిన బత్తుల ఆనందరావు సోమవారం అద్దంకి వచ్చారు. అద్దంకిలో ఉన్న స్నేహితుడితో కొంతసేపు గడిపారు. అనంతరం రామకూరు వెళ్లేందుకు పట్టణంలోని కొత్తదామావారిపాలెం వద్ద కలవకూరు రోడ్డులో వేచి ఉన్నాడు. అటు వైపు వెళ్లే ఆటోను ఆపినప్పటికీ ఎక్కించుకోలేదు. దీంతో సమీపంలో ఉన్న సైడ్ కాలువ వద్ద కూర్చున్నాడు. ఆ సమయంలోనే సైడ్ డ్రైన్‌లో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అనంతరం స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న బంధువులు వచ్చి ఆనందరావు మృతదేహాన్ని తీసుకువెళ్లారు.



ఆనందరావు మృతదేహం





భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తికమాసం ముగిసిన మరుసటి రోజు జరుపుకునే పోలి పాడ్యమి వేడుకలను మహిళలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా నగరాల మొదలు గ్రామాల వరకు మహిళలు తెల్లవారుజామునే అరటి దొనేలో దీపాలను వెలిగించి తమకు అందుబాటులో ఉన్న నీటి కుంటలు, చెరువులలో వదిలి పోలిని స్వర్గానికి పంపుతున్నట్లుగా భావించి పూజలు చేశారు. ఇటు ఒంగోలు నగరంలో సైతం మహిళలు పోలిస్వర్గం వేడుకను నిర్వహించుకున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుతో చలి పెరగటం కారణంగా ఈ సంవత్సరం చాలామంది మహిళలు సోమవారం తెల్లవారుజామున తమ ఇళ్ల వద్దే బేసిన్లలో నీటిని పోసి అందులో దీపాలు పెట్టిన అరటిదొప్పలను వదిలి పూజలు నిర్వహించారు. అనంతరం వారు వివిధ శివాలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు.



ఒంగోలులోని చెన్నకేశవ గుడి వద్ద..

అంతా పారదర్శకమే

● రేషన్ అక్రమాలకు పాల్పడితే కేసులు పెడతాం
● నెల రోజుల్లో 75మంది డీలర్లపై 6ఏ కేసులు నమోదు
● జిల్లా వ్యాప్తంగా 3,585 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం, 42 కేసులు నమోదు
● ఆంధ్రజ్యోతితో డీఎస్‌వో పద్మశ్రీ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో కార్డుదారులకు రేషన్ పారదర్శకంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించకుండా బయటకు తరలిస్తున్నట్లు నా దృష్టికి వస్తే అటువంటి వారిని ఉపేక్షించేది లేదు. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలు నిరంతరం పర్యవేక్షించడంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా కార్డుదారులకు సరుకులు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశాం. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలింపును అడ్డుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్‌ఓ) ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. జిల్లాలో తమ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తారా?

జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తమ శాఖతోపాటు జేసీ గోపాలకృష్ణ దృష్టికి వచ్చిన వెంటనే దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేసి, కేసులు కూడా నమోదు చేస్తున్నాం. జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యాన్ని వారికే అందేవిధంగా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతోపాటు రేషన్ షాపులపై కూడా నిరంతరం నిఘాను పెడుతున్నాం.

ఎన్ని రేషన్ షాపులపై కేసులు నమోదు చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 75 రేషన్ షాపులపై 6(ఏ) కేసులను నమోదు చేశాం. ఆయా షాపులకు కేటాయించిన బియ్యంలో తేడాలు ఉండటంతో కేసులు నమోదు చేశాం. గోడౌన్ నుంచి ఆ షాపునకు బియ్యం, ఇతర సరుకులు కేటాయింపులు చేసిన తర్వాత అక్కడ నిల్వలు ఉండాలి. కానీ కొన్ని షాపుల్లో తక్కువగా ఉండటం, మరికొన్నిచోట్ల ఎక్కువగా ఉండటం కనిపించింది. దీంతో ఆయా రేషన్ దుకాణాలపై కేసులు నమోదు చేశాం.

ఈనెలలో ఎన్ని క్వింటాళ్ల రేషన్ సీజ్ చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 3,585 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశాం. బియ్యం మిల్లులతోపాటు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకొని పౌరసరఫరాల గోడౌన్లకు తరలించాం. ఆ బియ్యంతో సంబంధం ఉన్న 42 మందిపై కేసులు కూడా నమోదు చేశాం. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు.

తనిఖీల సమయంలో వత్తిళ్లు లేవా?

రేషన్‌షాపుల తనిఖీలు, మిల్లులు, వాహనాల్లో తరలింపు సమయంలో పట్టుకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. మాకు ఇంత వరకు ఎలాంటి వత్తిళ్లు రాలేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా అక్రమంగా బియ్యం తరలింపు జరుగుతుంటే జాయింట్ కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు కూడా సమాచారం వస్తోంది, వెంటనే దాడులు చేసి పట్టుకుంటున్నాం. ప్రభుత్వపరంగా తమకు అన్ని విధాలుగా సహకారం ఉంది. అందువల్ల తమకు ఎటువంటి వత్తిడి రావడం లేదు.

ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండో స్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచింది. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రమావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్ల జత



కుచ్చు ముడుత తెగులు సోకిన మిరపపంట



పచ్చపురుగు ఉన్న శనగ పంట

పురుగులు.. తెగుళ్లు

(5వ పేజీ తరువాయి)

దిగుబడులు సగానికి సగం పడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగైన ప్రధాన పంటలు దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఉన్నాయి. వాటిలో కంది, మిర్చి, వరి, పొగాకు, మినుము, అలసంద, పత్తి వంటివి ప్రధానమైనవి. వాటిపై తెగుళ్లు, పురుగుల ఉధృతి అధికంగా ఉంది. రెండింతుల విస్తీర్ణంలో తెగుళ్ల తీవ్రత ఉండగా నివారణ కోసం రైతులు దాదాపు ఎకరాకు కనీసం రూ.3వేల నుంచి 5వేల వంతున వేసినా ఇంచుమించు రూ.100కోట్ల మేర సస్యరక్షణ మందుల కోసం ఖర్చుచేశారు. అయినా తెగుళ్ల అదుపులోకి రావడంలేదని వాపోతున్నారు. సాధారణంగా ఈ సమయంలో పొలంలో ఉన్న పంటలపై తెగుళ్ల సోకుతుంటాయి. నివారణకు రైతులు మందులు పిచికారీ చేసి వాటిని అదుపు చేస్తారు. కానీ ప్రస్తుతం జిల్లాలో వారం రోజులుగా నెలకొన్న వాతావరణం చీడపీడల ఉధృతికి దోహదం చేస్తుండటంతో మందులు వాడినా అవి అదుపులోకి కావడం లేదని రైతులు చెబుతున్నారు.

భిన్న వాతావరణం

సాధారణంగా ఈ సమయంలో వర్షాలు తిరిగి పగటిపూట ఒక మోస్తరు ఎండలు, రాత్రిపూట కొంతమేర చలి, తెల్లవారుజామున మంచు ఉంటుంది. దీంతో పురుగు, తెగుళ్ల ఆశించినా పగటి పూట ఎండలతో బయటకు వచ్చి రైతులు పిచికారి చేసే సస్యరక్షణ మందులు పనిచేయడంతో చచ్చిపోతాయి. కొన్నిరకాల తెగుళ్ల చలి, మంచుతో పోతాయి. అయితే ప్రస్తుతం వాతావరణం అందుకు భిన్నంగా ఉంది. పదిరోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి పగటి పూట ఎండ కనిపించకపోవడమే కాక నిత్యం జల్లులు పడుతున్నాయి. రాత్రిపూట సాధారణంగా ఉండే చలి, మంచు అంతగా కనిపించలేదు. దీంతో జిల్లాలో ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అన్న తేడా లేకుండా అన్నిచోట్ల పంటలపైన తెగుళ్లు, పురుగుల దాడి పెరిగింది. ఏపుగా పెరుగుతున్న మిర్చి, కంది పంటలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మిర్చిపై జిల్లా అంతటా కుచ్చుతెగులు సోకింది. దీని వల్ల ఆకులు ముడతలు పడి వంకర్లు తిరిగిపోవడంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోయి ఎండిపోతున్నాయి. తామర పురుగు, రసం పీల్చే తెల్లపురుగు, నల్ల వైరస్ ప్రభావం కూడా కనిపిస్తోంది. పశ్చిమప్రాంతంలోని దోర్నాల, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, వైపాలెం తదితర మండలాల్లో వేసిన ఖరీఫ్ మిర్చిలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని పరిస్థితి కనిపిస్తోంది.

భయపెడుతున్న పచ్చపురుగు

కనిగిరి, పొదిలి, మార్కాపురం, దర్శి తదితర సబ్‌డివిజన్ల పరిధిలో సాగు చేసిన కంది పైరు ప్రస్తుతం బాగా ఎదిగి పూత, పిందె దశకు చేరుకొంది. ఈ దశలో ఆకుముడత, ఎండు తెగులు, మచ్చల పురుగు సోకి వాటి ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయి. ఇక పొగాకులో జిల్లా అంతటా లద్దెపురుగు ప్రభావం అధికంగా ఉంది. వరిలో పడిదోమ ఉధృతంగా కనిపిస్తోంది. పత్తి పంటను రసం పీల్చే పురుగులు తీవ్రంగా నష్టపరుస్తుండగా శనగ, ఇతర పైర్లపైనా పచ్చపురుగు దాడి పెరిగింది. ఇప్పటికే ప్రధాన పంటలైన మిర్చి, కంది, పత్తి, పొగాకు, వరి పంటలకు ఈ తెగుళ్లు, పురుగుల దెబ్బకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, ప్రస్తుత వాతావరణం ఇలాగే కొనసాగితే సగానికి సగం పంట ఉత్పత్తి తగ్గి నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

మణికేశ్వరం ఆలయాభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వ్యాపార, సర్వీసు వర్గాల ప్రజలు సచివాలయ సిబ్బంది చేపట్టే సర్వే కు అవసరమైన డాక్యుమెంట్లను అందజేసి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రీన్యూర్స్ (ఎంఎస్‌ఎంఈ) వ్యాపారం నిర్వహించే సంస్థల సర్వే నిర్వహిస్తున్నందున సహకరించాలని కోరారు. వ్యాపార, సర్వీస్ సంస్థ అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోర్స్‌కు ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు ఈ నెల 4వ తేదీ లోపు దరకాస్తులు చేసుకుని అవకాశాన్ని సద్వినియోపర్చుకోవాలి కోరారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్టిఫికెట్ ఇస్తాయని తెలిపారు. వివరాలకు 9543970871, 9440635677 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రోటరీ సహకారంతో రక్తదానం

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో బాధపడుతున్న మహిళకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం చేసారు. సోమవారం రక్త హీనతతో బాధపడుతున్న కొత్తమాసు లక్ష్మీ కోటేశ్వరమ్మ అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు చెప్పగా రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరక్టర్ చుం దూరి మురళీసుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకికి చెందిన మారం సత్య సురేంద్రకుమార్ ద్వారా రక్తాన్ని సేకరించారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కోశాధికారి మల్యాది శ్రీనివాసరావు, ఏపీజీ రమేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సోమవారం టెలికం రిటైర్డ్ ఏఈ పసుపులేటి ఆంజనేయులు మనుమరాలు యశ్విత పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమానికి నిత్యావసరాలను అందజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరావు, శ్రీనివాసరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.



శ్రుతి, వెంకటేష్‌లను అభినందిస్తున్న పీడీ ప్రతిమ

వారిద్దరూ విద్యార్థులు. చిన్నతనం నుంచి పాఠశాలలో యోగాసనాలు సాధన చేస్తూ దాన్నే ఇష్టంగా మార్చుకున్నారు. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలనే సంకల్పంతో కృషి చేశారు. వారి ఆసక్తిని గుర్తించిన కోచ్ మెళకువలు నేర్పి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో వారు రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో విజయదుందుభి మోగించారు. మారుమూల పల్లెలోని పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. వారే పంగులూరు మండలం చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన నాయపాము శ్రుతి, మంగిశెట్టి వెంకటేష్. ఆ ఇద్దరి సంకల్పంపై ప్రత్యేక కథనం..

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటా

యోగాలో ఉత్తమ శిక్షణ పొందడం ద్వారా జాతీయస్థాయిలో రాణించి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలనేది నా లక్ష్యం. నేను యోగాలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు మా ఆర్థిక స్థితి సరిపోదు. దాతలు సహకరిస్తే తప్పకుండా లక్ష్యం చేరుకుంటా.

\- నాయపాము శ్రుతి

యోగా అంటే ఎంతో ఆసక్తి

యోగా అంటే నాకు ఆసక్తి. శిక్షణతో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటా. మా అమ్మ, నాన్నల తోడ్పాటు ఎంతో ముఖ్యమైంది.

\- వెంకటేష్

- ఆసనాల్లో రాణిస్తున్న చందలూరు పాఠశాల విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పలు విజయాలు
- అంతర్జాతీయ స్థాయికి చేరాలన్నదే లక్ష్యం

సంకల్ప యోగం



జాతీయ పోటీలకు శృతి ఎంపిక

శృతి ఈ ఏడాది తెలంగాణలో హైదరాబాద్ కేంద్రంగా జనవరి 8, 9, 10 తేదీల్లో జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొననుంది. తండ్రి లాజర్ గొర్రెల కాపరి. తల్లి మార్తమ్మ వ్యవసాయ కూలీ. పాఠశాలలో 6వ తరగతిలో చేరిన వీరి కుమార్తె శృతికి యోగాసనం పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించిన ప్రతిమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. రెండేళ్ల వ్యవధిలో యోగాసనంలో మెళకువలు అందిపుచ్చుకున్న శృతి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి అస్సాం, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. జాతీయస్థాయి పోటీల్లో రాణించి అంతర్జాతీ యోగాసన పోటీల్లో పాల్గొనాలనే లక్ష్యం దిశగా శృతి సాధన చేస్తోంది. ఇప్పటికే ఆర్ఐపీ భాషా, రాష్ట్ర పరిశీలకులు రాజ్‌కుమార్‌లచే సత్కారం పొందింది. విశాఖ స్టేట్‌మీట్‌లో ప్రతిభచాటి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంది.

పంగులూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు విద్యార్థులు నాయపాము శృతి, మంగిశెట్టి వెంకటేష్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నారు. గతేడాది నుంచి వీరిద్దరికీ యోగాపై ఉన్న ఆసక్తిని పీడీ (ఫిజికల్ డైరెక్టర్) ప్రతిమ గుర్తించారు. వారికి శిక్షణ ఇస్తూ ప్రోత్సహించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కావడంతో ఎన్ఆర్ఐ సుమతీకృష్ణ దంపతులు ఈ విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు.

మరింత శిక్షణ ఇస్తా


మా స్కూలు నుంచి 20 మంది విద్యార్థులు యోగాలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. శృతి, వెంకటేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తా. శృతికి రోజుకు ఐదు గంటలు శిక్షణ ఇస్తున్నాం. ఆదివారం రోజుల్లోనూ శిక్షణ కొనసాగిస్తున్నాం.

\- ప్రతిమ, పీడీ, చందలూరు



జాతీయ పోటీల్లో రాణించిన వెంకటేష్

మంగిశెట్టి వెంకటేష్ యోగాసన పోటీల్లో జాతీయస్థాయికి ఎదిగాడు. కర్నూల్, విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొన్నాడు. ఈ ఏడాది విశాఖలో రాష్ట్రస్థాయి పోటీల్లో రెండవ స్థానం దక్కించుకున్న వెంకటేష్ హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. వెంకటేష్ కర్నూలు, వీరవాసం, విశాఖ స్టేట్‌మీట్‌లలో పాల్గొన్నాడు. విశాఖ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి చేతలు మీదుగా మెడల్ అందుకున్నాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నాడు.



చిన్నకండ్లేరు చెరువు



మరమ్మతులకు నోచుకోక లీకుతో వృథా అవుతున్న నీరు

లీకులు ఎక్కువ.. నిల్వ తక్కువ!

- చిన్న కండ్లేరు చెరువు పరిస్థితి ఇదీ
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక లీకవుతున్న నీరు
- చెరువు ఖాళీ అయితే వేసవిలో ఎద్దడి ప్రమాదం

జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో రెండవదైన పుల్లలచెరువు చిన్న కండ్లేరు చెరువుకు జలకళ వచ్చింది. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో యథేచ్ఛగా నీరు లీకు అవుతోంది. గతంలో కురిసిన వర్షాలకు చెరువు నిండినప్పటికీ, కట్టవెంబడి ఉన్న తూము నుంచి ఉన్న లీకేజీ కారణంగా యథేచ్ఛగా నీరు వృథాగా పోతోంది. దీనివల్ల వేసవిలో నీటి సమస్య తలెత్తుతుందేమోనని పుల్లలచెరువు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పుల్లలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చిన్న కండ్లేరు చెరువు 500 ఎకరాల విస్తీర్ణంలో 35 అడుగుల లోతుతో 170 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యంతో ఉంది. గత 25 ఏళ్ల తర్వాత 2021లో ఈ చెరువుకు 25 అడుగుల మేరకు నీరు వచ్చింది. అయితే గత 6 ఏళ్లుగా చెరువుపై కనీసం చిల్లకంపను కూడా తొలగించకపోవడంతో చెరువు కట్ట అడవిని తలపిస్తోంది. దీనికి తోడు తూముల వద్ద కట్టకు లీకులు ఉండడంతో చెరువుకు నీరు చేరగానే లీకవుతోంది. 2021 డిసెంబరులో పడిన గండికి అప్పటి అధికారులు, గ్రామస్థులు కొంతమేర పూడ్చారు. అయినప్పటికీ, తూముల వెంబడి నీరు లీకవుతూనే ఉంది.

ఇటీవల కురిసిన వర్షాల తర్వాత చెరువుకు 20 అడుగులకు వరకు నీరు చేరింది. ఈ నీరు అంతా బయటకుపోతే సాగులో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నకండ్లేరు చెరువుతో పుల్లలచెరువు, గంగవరం, ఉమ్మడివరం, రాచకొండ, తెల్లగట్ల, వెంకటరెడ్డిపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో ఆయకట్టుతో పాటు భూగర్భ జలాలతో సుమారు 10 వేల ఎకరాలకు ప్రయోజనం చేకూర నుంది. అయితే నీరు లీకై చెరువులోని నీరు బయటకుపోతే ఆయా పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉంది.

చెరువునీరు లీకైతే పంటలకు నష్టం

ఈ చెరువు నిండడంతోనే ఈ ఏడాది పంటలు సాగు చేశాం. ఈ నీరు లేకపోతే పంటలు పండించలేం. ప్రభుత్వం శాశ్వత చర్యలతో పీటీ లీకులకు అడ్డుకట్ట వేసి నీటి వృథాను అరికట్టాలి. చెరువు నీరు లీకులు ఇలానే కొనసాగితే మార్చి నాటికి చెరువు ఖాళీ అవుతుంది. వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

\- జానకి రఘు, పుల్లలచెరువు గ్రామస్థుడు

శాశ్వత మరమ్మతులు చేయాలి

చెరువుకు పడిన గండిని అప్పటి ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేసింది. చెరువు కట్ట, తూముకు శాశ్వత పరిష్కారంగా పనులు చేయాలి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే చెరువుకు గండి పడింది. నీరు పూర్తిగా బయటకుపోతే భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్యలు ఎక్కువ అవుతాయి. తక్షణమే అధికార యంత్రంగం లీకులు కాకుండా చర్యలు చేపట్టాలి.

\- చిన్నా, పుల్లలచెరువు



దర్శి సమీపంలో పరదాలతో కప్పి ఉంచిన ధాన్యం రాసులు

గుండె 'జల్లు'మంది!

దర్శి ప్రాంతంలో సోమవారం రోజుంతా చిరుజల్లులతో కూడిన వర్షం పడుతుండటంతో మాగాణి రైతులు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. కోతకువచ్చిన వరి పంట దెబ్బతింటుందని భయపడుతున్నారు. కొంత మంది రైతులు వరిపంట కోసి నూర్చి పొలాల్లో రాసులు పోశారు. ప్రస్తుతం వర్షం పడుతుండటంతో ధాన్యం తడవకుండా పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు.

\- దర్శి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై సత్వరం, సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని హితవు పలికారు. వచ్చిన ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఆ అర్జీలను అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిసితుల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని, రీ ఓపెన్ కారాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం 228 అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

- మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆ గ్రామానికి ఉప సర్పంచ్ ఎస్.లక్ష్మీ, సభ్యులు నీలం వెంకటరావు, అనిల్ తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను కలెక్టర్, జేసీ, ఇతర అధికారులకు విన్నవించారు.









విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ అన్సారియా
- ఘనంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని, మనోధైర్యంతో విజయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించడంతోపాటు వారిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నట్టు తెలిపారు. వారు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 300 మంది దివ్యాంగ విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సైనిక సంక్షేమశాఖాధికారి రజనీకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.





నేర వార్తలు

పెదకొత్తపల్లిలో బంగారం చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీస్

మద్దిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకొత్తపల్లిలో ఇంటి తాళం పగులకొట్టి బంగారం అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పెద్దకొత్తపల్లికి చెందిన కాటా భారతి, శేషారెడ్డి బెంగళూరులో కుమారుడు వద్దకు సెప్టెంబరు 11న వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చి చూసే సరికి దుండగులు ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న ఐదున్నర సవర్ల బంగారు గొలుసు, ఉంగరాలు, 30 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. సంఘటనపై మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలు

సంతనూతలపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతిచెందిన సంఘటన మండలంలో చిలకపాడులో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు పాలపర్తి రాంబాబు తెలిపిన సమాచారం మేరకు... రాత్రి గొర్రెలదొడ్డిలో గొర్రెపిల్లలకు మేత వేసి ఇంటికి వచ్చారు. అర్ధరాత్రి సమయంలో 17 గొర్రెపిల్లలపై వీధికుక్కలు విచక్షణారహితంగా దాడిచేయడంతో 15 జీవాలు మృతిచెందగా రెండు తీవ్రంగా గాయపడ్డాయి. దాదాపు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

9నుంచి మహిళలకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 9వతేదీ నుంచి నెల రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. వయస్సు 18నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని, ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 8309915577 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

మద్దిపాడు, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాలలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.జ్యోతి చెప్పారు. సోమవారం మండలంలోని బసవన్నపాలెం, పెదకొత్తపల్లి సచివాలయాలను ఆమె పరిశీలించారు. బసవన్నపాలెం సచివాలయంలో కేవలం ఇద్దరు ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండటం గమనించి సిబ్బంది ఖచ్చితంగా సమయానికి రావాలని ఆదేశించారు. ప్రస్తుతం వివిధ రకాల సర్వేలు జరుగుతున్నాయని వాటిలో సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రతిరోజు మండలంలోని అన్ని సచివాలయాల డీఏలు 10.45 గంటలకు హాజరు పంపాలని ఆదేశించారు. అనంతరం పెద్దకొత్తపల్లి సచివాలయంలో ఆమె వివిధ అంశాలను ఈఓఆర్డీ రఘుబాబుతో కలిసి పరిశీలించారు.


ఉడకని పప్పులు.. కూరగాయలు

పెరిగిన నిత్యవసరాల ధరలు

కొన్నిచోట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

సామాన్య జనం బెంబేలు

సంతనూతలపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : నిత్యవసరాల ధరలు అనూహ్యంగా పెరుగుతూ సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. గడిచిన మూడునెలలతో పోలిస్తే మధ్యతరగతి కుటుంబానికయ్యే ఖర్చు 15శాతం మేర పెరిగింది. నిత్యవసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో వీటికి ఉల్లిధరలు జత కలిసి సామాన్య ప్రజలను మరింత కలవరపరుస్తున్నాయి. మండలంలో ఎక్కువ భాగం వ్యవసాయాధారిత గ్రామాలు కావడం, బడుగు, బలహీన వర్గాల వారు అధికంగా ఉండడంతో పెరిగిన ధరలతో కుటుంబాలను నెట్టుకొచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



సామాన్యులు విలవిల....

పెరిగిన ధరలు సామాన్యులపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. ప్రతి నెలా పప్పుల కోసం కేటాయించే మొత్తం రెండింతలు కావడంతో వినియోగం తగ్గించుకోవాలిసిన పరిస్థితి ఏర్పడింది. పేదలైతే పప్పు వినియోగానికి దాదాపుగా దూరమైనట్లేనని చెప్పవచ్చు. పెరిగిన పప్పు ధరలు హోటళ్లపైనా తీవ్రప్రభావం చూపుతున్నాయి. ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని వ్యాపారం దెబ్బతింటుందని యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతికూల వాతావరణం, ముఖ్యప్రాంతాల్లో పంట దిగుబడులు తగ్గడం వంటి కారణాలు ఉన్న, వీటినే సాకుగా చూపి కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఈవిషయంపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

అధికారులు చొరవచూపితే పేదలకు కొంతైన భరోసా

వాస్తవానికి నిత్యవసర వస్తువుల ధరలు ఎప్పటికపుడు పరిశీలించి వినియోగదారుడిపై పడకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలిసిన అవసరముంది. రోజూ వినియోగించే పప్పు ధరలు పెరుగుతున్నా యంత్రాంగం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ధరలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటే అది సామాన్యుడికి ఒకింత ఊరటే. అవసరమైన పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పా



కూరగాయలు, వెలవెలబోతున్న కిరాణ స్టోర్

టుచేసి పప్పులు, ఉల్లిపాయలపై రాయితీతో సామాన్యులకు అందుబాటులోకి తెస్తే కొండపైన ఉన్న ధరల పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశముందని ప్రజలు వాపోతున్నారు.

ధరల పెరుగుదలకు పలు కారణాలు

నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు పలు కారణాలు ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు రైతులు సాగుచేసిన పైర్లు దెబ్బతినడం, పప్పుధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అంతేగాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఉల్లి దిగుమతి తగ్గడంతో ధరలు మరింతగా పెరిగేందుకు కారణమైందని చెబుతున్నారు. నాణ్యమైన కిలో ఉల్లి రూ.100 ఉండగా, నాణ్యమైన తెల్లగడ్డలు కిలో దాదాపు రూ.350 నుంచి రూ.400 పలుకుతోంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలోరూ.150, కంది పప్పు రూ.180, మినపప్పు రూ.130, సాయిపెసరపప్పు రూ.120, పచ్చశనగపప్పు రూ.100, ఎండుకొబ్బరి రూ.200లకు చేరుకున్నాయి.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, యువపారిశ్రామికవేత్త రాఘవరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో లోకేష్‌ను కలిసి జిల్లాలోని పలు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ స్థాపించి సంవత్సరాలు గడుస్తున్నా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మాగుంట

పరిధిలోని పలు పాఠశాలల్లో తరగతుల గదులు కూడా నిర్మించాల్సి ఉందని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఆలాగే పలు రకాల సమస్యలను మంత్రి దృష్టికి మాగుంట తీసుకెళ్లారు.

కొత్త జాతీయ రోడ్లుగా స్థాయి పెంపుపై మాగుంట ప్రశ్న

రాష్ట్రంలో ఐదేళ్లలో ఎన్నిరాష్ట్రాల రహదారులను జాతీయ రహదారులుగా స్థాయిపెంచారని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర రోడ్డు, రవాణా, హైవేస్ శాఖమంత్రి నితిన్ జైరాం గడ్కరి సమాధానం ఇస్తూ రాష్ట్రంలో 1830 కి.మీటర్ల రోడ్లను కొత్త జాతీయరహదారులుగా స్థాయి పెంచామన్నారు.

నూతన ఒరవడికి శ్రీకారం

మంత్రి స్వామి పుట్టినరోజును పురస్కరించుకొని టీడీపీ నేతల వినూత్న కార్యక్రమం

సొంత నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు

మర్రిపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మండల టీడీపీ నాయకులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఫ్లెక్సీలు వేయడం, కేకులు కట్ చేయడం కన్నా ప్రజా సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించుకొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. టంగుటూరు - పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు చేపట్టారు. గత కొంతకాలంగా చిల్లచెట్ల కారణంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కొమ్మలు గీసుకుపోయి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గుండ్లసముద్రం నుంచి కూచిపూడి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను సొంత నిధులతో తొలగించాలని టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. ఈమేరకు సోమవారం తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. 15 కిలో మీటర్ల మేర తొలగించనున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదేస్ఫూర్తితో గోతులమయమైన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా చిల్లచెట్లను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా కార్తీకమాస పోలిపాడ్యమి వేడుకలు



బావివద్ద దీపాలను వదులుతున్న మహిళలు

సంతనూతలపాడు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాస పోలిపాడ్యమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువ జాము నుంచే ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఎస్.బుచ్చిబాబు ఆధ్వర్యంలో మహిళలు ఆలయంలోని బావి వద్ద దీపాలను వదిలారు. నవంబరు 2న ప్రారంభమైన కార్తీక మాసవేడుకలు డిసెంబరు 2తో ముగిసినట్లు అర్చకులు బుచ్చిబాబుశర్మ తెలిపారు.

5న సాగునీటి ఎన్నికలకు సర్వం సిద్ధం

సంతనూతలపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా ఉండే నీటి భాండాగారాలైన సాగునీటి చెరువుల పర్యవేక్షణకు దశాబ్దకాలంగా పాలకులు కరువయ్యారు. దీంతో చిన్నతరహా సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈపరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు సంసిద్ధం కావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల్లో ఎంతమంది రైతులు ఉన్నారో ఆ వివరాలు సేకరించింది. నీటిసంఘాల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. ఈక్రమంలో మండలంలో ఈనెల 5న నిర్వహించనున్న సాగునీటి ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 18,827 మంది రైతులకు ఓట్లు ఉన్నాయి. మొత్తం 12 మేజర్ నీటి కాలువలకు, 6 చెరువులకు సంబంధించి ఎన్నికలు జరగనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ మాయం

కొండపి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని కామేపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న గుమ్మళ్ల రాంబాబుకు చెందిన ట్రాక్టరు ట్రక్కుతో సహా మాయమైంది. రాంబాబు ఇంటికి సమీపంలోని ఖాళీ స్థలంలో ట్రాక్టర్‌తోపాటు దానికి సంబంధించిన ఇతర సామగ్రిని ఉంచుతారు. ఆదివారం ఆయన ట్రాక్టర్‌ను వ్యవసాయ పనులకు తీసుకెళ్లి రాత్రికి యథావిధిగా ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో నిలిపారు. సోమవారం ఉదయానికి అది కనిపించలేదు. దీంతో దొంగలు ఎత్తుకెళ్లినట్లు అనుమానించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాగు.. జాగు

ప్రకృతి ప్రతికూలతతో పంటలు వేయలేకపోతున్న రైతులు

సీజన్ దాటుతుండటంతో ఆందోళన

టంగుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్ పంటల సాగు ముందుకు సాగడం లేదు. ఇటీవల తుఫాన్, అంతకుముందు వర్షాలు ప్రతిబంధకంగా మారాయి. సీజన్ దాటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది వర్షాలు ఆశాజనకంగానే కురిశాయి. వాగులు, వంకలు, చెరువులు నిండు కుండలా ఉన్నాయి. వ్యవసాయ పనులకు, ఆతర్వాత సాగు అవసరాల కోసం నీటికి ఎలాంటి డోకా ఉండదని రైతులు సంతోషించారు. ఇంతలో గత వారంలో వచ్చిన తుఫాన్, అంతకు ముందు కురిసిన భారీ వర్షాలతో అదునులో పంటలు వేయలేకపోయారు. సాధారణంగా మండలంలోని పడమర గ్రామాల్లో ముందుగానే పంటల సాగు మొదలవుతుంది. ఆ తరువాతే తూర్పు గ్రామాల్లో వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. రెంటికీ మధ్య నెల సమయం ఉంటుంది. ఎప్పటి లాగే పడమర గ్రామాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమై పొగాకు, శనగ, మినుము, కంది సాగైంది. పడమర గ్రామాల్లో పంటల సాగు 70శాతం పూర్తయ్యింది. తూర్పు గ్రామాల్లో కేవలం 30 శాతం పంటల సాగు ముగియగానే తుఫాన్ హెచ్చరికలు జారీ అయ్యాయి. దీనికి వర్షం కూడా తోడైంది. దీంతో రైతులు పొలం పనులు నిలిపి వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతలో వారం రోజులు గడచిపోయాయి. పొలాలు ఆరి పంటల సాగు పునఃప్రారంభించాలంటే మరో వారం ఆగాల్సి ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ముగిశాక వేస్తే అవి సక్రమంగా పెరగవు. దిగుబడులు భారీగా పడిపోతాయి. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

డీపీఆర్‌వోగా వేణుగోపాల్



కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ (డీపీఆర్వో) అధికారిగా పీ వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకు పనిచేసిన గ్రేస్‌లినోర గత నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో నెల్లూరులో పనిచేస్తున్న వేణుగోపాల్‌ను జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్ సోమవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జేసీ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌ను సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

అవీఇవీ

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని సైనిక సంక్షేమశాఖ ప్రచురించిన స్టిక్కర్లు, కారుఫ్లాగ్స్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ స్టిక్కర్లను జిల్లాలోని వివిధ కార్యాలయాలకు పంపి వాటి అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును యుద్ధంలో మరణించిన/గాయడిన వారి కుటుంబాల సంక్షేమం కోసం వినియోగించనున్నట్లు చెప్పారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి జిల్లాలోని ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు విరాళాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీకలెక్టర్ లోకేశ్వరరావు, సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి పాల్గొన్నారు.

4న మండల స్థాయి అధికారులకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల స్థాయి అధికారులకు ఈనెల 4వ తేదీన స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో బి. చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మండల స్థాయి అధికారులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

క్విస్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఒంగోలు విద్య, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ ప్రాజెక్టు నిర్వహించిన రీల్స్ కాంపిటేషన్‌లో క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు బహుమతులు సాధించారు. చందు, లక్ష్మి ప్రసన్న టీం సభ్యులు ప్రథమ బహుమతి సాధించగా క్విస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన పల్లవి, తేజస్వి, మేఘన, లక్ష్మిలహరి, పూజిత వర్షిత బృందం రూపొందించిన రీల్‌కు ద్వితీయ బహుమతి సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సూర్య కల్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, బీఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ కిషోర్‌లు అభినందించారు.

ఆధునిక సాంకేతికత అంశంపై పోటీలు

ఒంగోలు విద్య, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కంప్యూటర్ సాక్షరత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, జీపీ హైస్కూలు సంయుక్తంగా ఆధునిక సాంకేతికతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లోని విజేతలకు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై సుష్మా, ఎం. హేమ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పేస్‌లో ఎఫ్‌డీపీ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఒంగోలు విద్య, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాల ఫేస్ టు ఫేస్ అటల్ అడ్వాన్స్‌డ్ ఎఫ్‌డీపీ ఆన్ వీఎల్‌ఎస్ఐ ట్రెండ్ ఆన్ నెట్‌వర్క్ ఆన్‌చిప్ ఎండి ఇట్స్ అప్లికేషన్స్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏఐసీటీఐ, న్యూఢిల్లీ అటల్ అకాడమీ ఆధ్వర్యంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తిరుచాపల్లి ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. నరేష్‌కుమార్ రెడ్డి ఎమర్జింగ్ లోపవర్ బైడైరెక్షనల్ ఎన్ఓసిరూటర్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అటల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగే రెండు వారాల ఎఫ్‌డీపీ వల్ల ఎంతో మంది అధ్యాపకులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. అప్పారావు, డీన్‌లు ఉన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఏఆర్ కానిస్టేబుల్

అభినందించిన ఎస్పీ



కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన పోలీసు బ్యాండ్ పోటీలలో ఏఆర్ కానిస్టేబుల్ ఈవీ నరసింహులు బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నరసింహులను ఎస్పీ దామోదర్ అభినందించారు. గత నెల 16 నుంచి 22వ తేదీ వరకు నాగాలాండ్‌లోని దిమాపూర్‌లో ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి బగల్స్ విభాగంలో జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరసింహులు బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డిలు పాల్గొన్నారు.

డిసెంబరులోపు ఇంటిపన్నులు నూరు శాతం వసూలు

ఒంగోలు రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో డిసెంబరులోపు నూరు శాతం ఇంటిపన్నులు వసూలు చేస్తామని ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ మాట్లాడుతూ దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం గ్రామాలలో ఇప్పటికే వంద శాతంపన్ను వసూలు చేశామన్నారు. కరవది గ్రామపంచాయతీలో 2400గృహాలకు గాను1667 గృహాలవారు పన్ను చెల్లించినట్లు చెప్పారు.



ఇంటిపన్నుల కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

రేషన్ బియ్యం, కందిపప్పు సీజ్



గదిని పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన 22 బస్తాల రేషన్‌బియ్యం కందిపప్పును సీజ్ చేసినట్లు తహసీల్దార్ బాలకిషోర్ తెలిపారు. పట్టణంలోని మసీద్ వీధిలో ఒక గదిలో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు గదిని పరిశీలించగా 22 బస్తాల రేషన్ బియ్యం, 50 కిలోల కందిపప్పును గుర్తించి వాటిని సీజ్ చేశామన్నారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమాచారం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా బియ్యం తీసుకెళ్లాలని కోరారు. డీలర్లు ఎక్కడైన బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా, కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు ఎల్లయ్య, దానం, వీఆర్‌ఏలు ఉన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాలకిషోర్ బాధ్యతలు

పుల్లలచెరువు, డిసెంబరు 2: పుల్లలచెరువు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాలకిషోర్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎర్రగొండపాలేనికి రెగ్యులర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.

మరుగుదొడ్లు మంజూరు: ఎంపీడీవో

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా ఎర్రగొండపాలెం మండలానికి 1000 మరుగుదొడ్లు నూతనంగా మంజూరైనట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. నూతనంగా మరుగుదొడ్లు కట్టుకునేవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. మండల పరిధిలోని ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఒక్కో మరుగుదొడ్డికి ప్రభుత్వం రూ.15వేలు అందిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆధార్‌కార్డు, ఆధార్‌కి లింక్ అయిన బ్యాంక్ ఖాతా నెంబర్, రేషన్ కార్డు నకలతో పంచాయితీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

భోజనశాల ఏర్పాటుకు పూర్వ విద్యార్థుల సాయం



హెచ్‌ఎంకు నగదు అందచేస్తున్న పూర్వవిద్యార్థులు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు సహకారం అందించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా భోజనశాల ఏర్పాటు కోసం రూ.73,216లు ప్రస్తుత హెచ్‌ఎం బి.అనురాధకు అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిదులు అద్దంకి మధుసూదన్‌రావు, చీతిరాల విక్రమ్, సునీల్‌కుమార్, ప్రసాద్, శ్రీను, వీరి గురువులు బల్లాని ఆదినారాయణ, జి.రవీంద్రనాథరెడ్డి, ముత్తుముల రామచంద్రరెడ్డి, ఉపాధ్యాయులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎరిక్షన్‌బాబుకు సేవ్యానాయక్ కృతజ్ఞతలు



ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న సేవ్యానాయక్, నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరక్టర్‌గా కాండ్లావత్ సేవ్యానాయక్‌ను ఇటీవల రాష్ట్రప్రభుత్వం నియమించింది. డైరక్టర్‌గా పేరును సూచించి మద్దతు తెలిపినందుకు సోమవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను అనుసరిస్తూ నాయకులతో కలసి కట్టుగా పనిచేస్తానని కార్పొరేషన్ డైరక్టర్ కాండ్లావత్ సేవ్యానాయక్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, సీనియర్ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు మండల నాయకులు కె.నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేయిస్తున్న నూతన కమిటీ సభ్యులు

పొదిలి, డిసెంబరు 2 : (ఆంధ్రజ్యోతి) : గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాచాభక్తుని గోవిందయ్య, ఉపాధ్యక్షులుగా రాచర్ల బ్రహ్మం, కార్యదర్శిగా వై వీరబ్రహ్మం, సంయుక్త కార్యదర్శిగా వై బాలప్రసాద్‌తో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారితో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు.

త్రిపురాంతకంలో రామచంద్రయాదవ్ పూజలు



ఆలయంలోకి వెళుతున్న రామచంద్రయాదవ్

త్రిపురాంతకం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో భారత చైతన్య యువ జన పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. చిన మస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం అర్చకులు రామచంద్రయాదవ్‌కు తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వదించారు. అనంతరం రామచంద్రయాదవ్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణానికి సంబంధించి త్వరలో జిల్లాల పర్యటన చేస్తామన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీని అన్ని స్థాయిలలో బలోపేతం చేసి ప్రజల పక్షాన నిలబడతామన్నారు. కార్యక్రమంలో బీసీవై నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లతో పల్లెలు కళకళ

- 2.8 కోట్లతో చురుగ్గా సాగుతున్న సిమెంట్‌రోడ్డు పనులు
- కూటమి ప్రభుత్వ చొరవతో పల్లెల్లో పండుగ

పొదిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తీసుకున్న పల్లెపండుగ నిర్ణయంతో పల్లెలు సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణంతో పల్లెలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో సుమారుగా 6.3 కిలోమీటర్ల మేర రూ.2.65 కోట్ల నిధులతో సిమెంట్‌రోడ్లు, సైడుకాలువల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. అక్కచెరువు రూ.20లక్షలు, జువ్వలేరు రూ.12లక్షలు, మల్లవరం రూ.6లక్షలు, మల్లవరం-2 రూ.5లక్షలు, సూదనగుంట రూ.20లక్షలు, తుమ్మగుంట రూ.7లక్షలు, తలమళ్ల రూ.20లక్షలు, తలమళ్ళ-2 రూ.5లక్షలు, కుంచేపల్లి రూ.20లక్షలు, కుంచేపల్లి-2 రూ.5లక్షలు, కొండాయపాలెం రూ.30లక్షలు, ఉప్పలపాడు రూ.13లక్షలు, ఏలూరు రూ.15లక్షలు, ఓబులక్కపల్లి రూ.7లక్షలు, ఆముదాలపల్లి రూ.15లక్షలు, అన్నవరం రూ.15లక్షలు, ఈగలపాడు రూ.30లక్షలు, పాములపాడు రూ.10లక్షలు, మూగచింతల రూ.10లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంక్రాంతి నాటికి రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం సిమెంట్ రోడ్ల ఏర్పాటు దిశగా ముందుకు సాగుతుందని ఎంపీడీవో శోభన్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు సగానికిపైగా రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. కిలోమీటర్‌పైగా రోడ్లు నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షాలకే అంతర్గత రోడ్లు కుంటలను తలపిస్తూ బురదమయమౌతున్నా పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాలు మురికి కూపాలుగా మారాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అంతర్గతరోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గ్రామాలలో సిమెంట్‌రోడ్డు పనులు జరుగుతుండటంతో అటు కూలీలకు ఉపాధితోపాటు ఇటు ప్రగతి పనులు వేగంగా సాగుతుండటంతో గ్రామ సీమలు నూతనశోభను సంతరించుకుంటునానయి. మండలంలోని గోగినేనివారి పాలెం గ్రామంలో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు పనులను ఎంపీడీవో శోభన్‌బాబు, పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణలు పరిశీలించారు. సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పనులు నాణ్యంగా ఉండేలా చేయాలని నిర్వాహకులకు ఎంపీడీవో సూచించారు.



గోగినేనివారిపాలెంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు సమున్నత లక్ష్యాలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఎస్సీ బాలికల వసతిగృహంలో సోమవారం సాయంత్రం విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చిన్న వయస్సులోనే సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించేందుకు ఆయన చేసిన కృషి ఫలితంగానే 24 సంవత్సరాలకే ఐఏఎస్ సాధించారన్నారు. అలాంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చదువులో ఉత్తమంగా రాణించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని అన్నారు. సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థినులు శ్రమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సమయాన్ని ఎప్పుడూ వృథా చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే భావిజీవితం పూలబాటగా మారుతుందన్నారు. ఈ విద్యార్థునులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యువో అరుణకుమారి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, యువత నాయకులు దొడ్డా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ప్రమాదం

ఆర్టీసీ బస్సు- ప్రైవేటు వాహనం ఢీ
కొద్దిసేపు స్తంభించిన రాకపోకలు



ప్రమాదానికి గురైన వాహనాలు

పెద్దదోర్నాల, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం ఘాట్‌రోడ్డులో సోమవారం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్‌టీసీ బస్సు, ప్రైవేటు వాహనం ఢీకొన్నాయి. దీంతో ఆ మార్గంలో కొద్దిసేపు రాకపోకలు నిలిచాయి. ఈ ఘటన శ్రీశైలం- దోర్నాల ఘాట్‌రోడ్డులో చింతల వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో శ్రీశైలం వైపు వెళుతున్న నరసావుపేట డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు దోర్నాల వైపు ఎదురుగా వస్తున్న ప్రైవేటు వాహనం అదుపు తప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో బస్సు, ప్రైవేటు వాహనం ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులు సురక్షితంగా ఉండడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంతో రెండు వైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణికులు పోలీసుస్టేషను కు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుకు పక్కకు తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఘటనపై పోలీసులు నమోదు చేశారు.

వర్షంతో పైర్లకు జీవం



జీవంపోసుకున్న శనగపైరు



గిద్దలూరులో జీవం పోసుకున్న మొక్కజొన్న

తర్లుపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)గత అర్ధరాత్రి నుంచి కురుస్తున్న చిరుజల్లులకు రబీలో సాగు చేసిన పొగాకు, వరిగ, శనగ, మొక్కజొన్న పంటలు జీవం పోసుకున్నాయి. ఈ వర్షంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. వర్షం ఇలాగే కొనసాగితే పంటలు పండుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ విలవిలలాడుతున్నాయి. ప్రస్తుతం చిరు జల్లులకు పంటలు జీవం పోసుకున్నాయి.

గిద్దలూరు : తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం సాగులో ఉన్న పంటలకు జీవం పోసుకున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు తేలికపాటి వర్షం కురిసింది. 10.ఎంఎం లోపు వర్షం పడినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఈ రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న, ఉలవలు, జొన్న, నువ్వు, పొగాకు, మిరప పంటలు ఈ ప్రాంతంలో సాగు కాగా వీటన్నింటికి ఈ వర్షం జీవం పోసిందని రైతులు చెబుతున్నారు. ఈ పంటలన్నీ కొమ్మ వచ్చే దశలో ఉన్నాయి. అలాగే ఇటీవలే సాగు మొదలైన మిరపకు కూడా ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌లో సాగైన కంది పూతదశలో ఉన్నప్పటికీ వర్షం చిన్నగానే పడడంతో పూతకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నారు. అయితే ఈ వర్షాలు రెండు, మూడు రోజులు పడితే మాత్రం కందికి పూత రాలుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది.

దివ్యాంగ చిన్నారులకు విస్తృత సేవలు

ఆర్‌డీటీ సంస్థ ఫౌండర్ స్పెయిన్ చెందిన లోలి గోంజలేజ్



ఆర్‌డీటీ సంస్థ కార్యాలయంలో స్పెయిన్ ప్రతినిధులు

పెద్దదోర్నాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ చిన్నారులకు తోడ్పాటు ఇచ్చేందుకు ఆర్‌డీటీ సంస్థ సమన్వయంతో విస్తృత సేవలు అందించనున్నట్లు స్పెయిన్ దేశానికి చెందిన ఫౌండర్‌లలో ఒకరైన లోలిగోంజలేజ్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు వద్ద ఉన్న ఆర్‌డీటీ సంస్థ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన దివ్యాంగ చిన్నారుల పాఠశాల, వసతి గృహాన్ని స్పెయిన్ దేశస్థులు లోలిగోంజలేజ్, కోంచిత, ఆసర్, క్రైక్సాపాపులర్, అండలూ సియా, ఎక్సాముదురా, క్యాటాలై మెలిల్లా, కార్మన్ పలాం, ఇజ్‌క్యూరిడో, ఇగ్నేషియా గార్సియా పెర్ద్‌రోసా మారియా మంజా నక్షలూపియాంజ్, జాన్ ఆంధోనియా సోలీస్ కోయిలో సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆర్‌డీటీ సంస్థ ఏటీఎల్ వేమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో స్పెయిన్ ఫౌండర్లు మాట్లాడారు. మానసిక దివ్యాంగు చిన్నారులు భవిష్యత్తులో మరొకరిపై ఆధార పడకుండా వారి పనులు వారు చేసుకునేలా ఉచితంగా ప్రత్యేక శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నంద్యాల, ప్రకాశం పల్నాడు జిల్లాల్లోని చిన్నారులు 130 మందిని గుర్తించామన్నారు. 80 మందికి భోజన సదుపాయంతో పాటు అన్నీ సేవలు అందిస్తున్నట్లు, ప్రధానంగా తల్లిదండ్రులు లేని చిన్నారులకు బాగా ఉపకరిస్తాయన్నారు. రానున్నరోజుల్లో ఈ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. కార్యక్రమంలో అనంతపురం డివిజనల్ ఆర్‌డీ రఫిక్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి స్వర్గం



కోనేటిలో దీపాలు వదులుతున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు సందర్భంగా మార్కాపురం పట్టణంలో పోలి స్వర్గం కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగదాంబ సమేత మార్కండేయ స్వామి ఆలయంలో అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మలు స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పోలీ స్వర్గం విశిష్టతను అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మలు తెలిపారు. జగదాంబ సమేత మార్కండేయ స్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి చెన్నకేశవ స్వామి పుష్కరిణి వద్దగల మండపంలో వేంచేపు చేశారు. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం భక్తులు కోనేటిలో దీపాలు వదిలి పోలిస్వర్గం కార్య క్రమం భక్తిశ్రద్ధలతో నిర్వ^ంచారు. అనంతరం జగదాంబ మార్కండేయ స్వామికి నాలుగు మాడ వీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు.

నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో..

పొదిలి : కార్తీకమాసం చివరిరోజు పోలిస్వర్గ సోమవారం పట్టణంలోని శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నెలరోజులు ఉపావాసదీక్షలో ఉన్న మహిళలు చివరిరోజు తెల్లవారు జామునుండే స్వామివారికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వదిలి పూజలు చేశారు.





పొదిలి నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, కోనేటి వద్ద వేంచిసిన జగదాంబ సమేత మార్కండేశ్వరుడు

డాక్టర్ రఫీకి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న రఫీ సతీమణి గౌసియా బేగం

గిద్దలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ మహమ్మద్ రఫీ లైఫ్ టైం అచీవ్‌మెంట్ డాక్టరేట్ అవార్డు పొందారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ పీరాన్‌వలి కుమారుడైన డాక్టర్ షేక్ మహమ్మద్ రఫి ఆయుర్వేద వైద్యునిగా పేరొందారు. గిద్దలూరులోనే కాకుండా హైదరాబాద్‌లోని నాదర్‌గోల్ ప్రాంతంలో సంపూర్ణ ఆయుర్వేద నిలయాన్ని ఏర్పాటు చేసి కీళ్లనొప్పులు, పక్షవాతం, కేన్సర్ రోగులకు సేవలందిస్తున్నారు. ఈయన రోగులకు అందిస్తున్న సేవలను గుర్తించిన 'ది అమెరికన్ యూనివర్సిటీ ఫర్ గ్లోబల్ పీస్' సంస్థ, 'సైఫా బుక్ ఆఫ్ రికార్డ్స్' సంయుక్తంగా డాక్టర్ మహమ్మద్ రఫీకి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేశాయి. ముంబాయిలోని సోఫియాబాబా ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో డాక్టర్ రఫి తరపున ఆయన సతీమణి గౌసియాబేగం వెళ్లి అవార్డును అందుకున్నారు.

'మీ కోసం'తో సమస్యల పరిష్కారం



అర్జీలు అందుకుంటున్న తహసీల్దార్

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'మీ కోసం' కార్యాక్రమం ఏర్పాటు చేసినట్లు ఎర్రగొండపాలెం తహసీల్దార్ బాలకిషోర్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ మీకోసం కార్యక్రమంలో మొత్తం మూడు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ మల్లికార్జుననాయుడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విళక్కి పూజ

గిద్దలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉమామహేశ్వర సహిత అయ్యప్పస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 4న బుధవారం అయ్యప్ప స్వామి కర్పూరనగర విళక్కి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు కటకం వినయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సుప్రభాతసేవ, నగర సంకీర్తన, కళశ స్థాపన, హోమాలు, అభిషేకం, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం, కర్పూర నగర విళక్కి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు, తెలిపారు. అయ్యప్పదీక్షధారులు భక్తులందరూ పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా రఫి



డీకేఎం రఫీ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ సీపీఎం కార్యదర్శిగా డీకేఎం రఫీ ఎన్నికయ్యారు. సీపీఎం పట్టణ 10వ మహాసభలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకు న్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులుగా డి.సోమయ్య, పి.రూబెన్, షేక్ నన్నేసా, జె.రాజు, వి.కాశయ్య, జి.షారాలు ఎన్నికయ్యారు. మహాసభలో పలు తీర్మానాలు చేశారు. మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణం వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని డాక్టర్ల బదిలీలు నిలుపుదల చేయాలని తీర్మానించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. అర్హులందరికీ ఇంటిస్థలాలు ఇవ్వాలని, మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటు చేయాలని వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలన్నారు. మొదటి సొరంగం ద్వారా నీటిని వెంటనే విడుదల చేయాలని తీర్మానాలు చేశారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మార్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేయాలని నిర్వాసితుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులో ముంపుకు గురయ్యే గ్రామాల్లోని భూములు కోల్పయిన రైతులకు గతంలో రూ.90 వేలు, రూ.1.10 లక్షల మేర పరిహారం అందజేశారన్నారు. రెండు దశాబ్దాలు దాటుతున్నా ప్రాజెక్టు పూర్తికాలేదన్నారు. గతంలో తక్కువ మొత్తంలో ఇచ్చిన పరిహారాన్ని పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

- స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన 'మీ కోసం' కార్యక్రమంలో మొత్తం 17 అర్జీలు వచ్చాయి. పుల్లలచెరువు గ్రామానికి చెందిన నక్కా బుర్రెమ్మకు నలుగురు కుమారులు ఉన్నారు. వారందరికీ ఆస్థి పంచి ఇచ్చి ఆమె ఉండేందుకు చిన్నపాటి ఇంటికి ఉంచుకుంది. కానీ మూడవ కుమారుడు వెంకటేశ్వర్లు కొడుకులు పెద్ద అంజి, చిన్నఅంజి ఆమెను బయటకు గెంటి తమకు ఆ ఇంటిని రాసివ్వాలని దౌర్జన్యానికి దిగుతున్నట్లు బుర్రెమ్మ సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు తెలిపి కన్నీటి పర్యంతమైంది. వెంటనే తహసీల్దార్‌తో సబ్‌కలెక్టర్ మాట్లాడారు. ఈ ఘటనపై విచారించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

4న మండల స్థాయి అధికారులకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల స్థాయి అధికారులకు ఈనెల 4వ తేదీన స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో బి. చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు.

వేములబండలో శ్మశానం కబ్జా

- ఖననం చేయటానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండలో సర్వే నెంబరు 71లో ఉన్న 2.51 ఎకరాలు బండిదారి పోరంబోకు భూమిని కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న శ్మశాన ఆక్రమణ స్థలం విలువ దాదాపు రూ.25 లక్షలకు పైమాటే. వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం వెళ్ళే రహదారికి పక్కనే ఆనుకొని ఉన్న విలువైన శ్మశానం భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. శ్మశానం భూమి అయితే అడిగే వారు లేనట్టుగా యథేచ్ఛగా ఆక్రమించుకొని వరితో పాటు ఇతర పంటలు సాగు చేశారు. దీంతో ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే పూడ్చి పెట్టేందుకు, ఖననం చేసేందుకు చాలినంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానం ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనికితోడు శ్మశానం స్థలం మధ్యలో గుండా కొందరు పొలాలకు వెళ్ళేందుకు దారిని ఆక్రమించుకొని వెళ్తున్నారు. దాదాపు 2.51 ఎకరాలు బండి పోరంబోకు భూమి ఉండగా అందులో 1.50 ఎకరాలకు పైగా స్థలం ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్ళింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామస్థ కోరుతున్నారు.



వేములబండలో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలం

మా దృష్టికి రాలేదు

వేములబండలో సర్వే నెంబరు 71లో ఉన్న 2.51 ఎకరాలు బండి దారి పోరంబోకు స్థలాన్ని శ్మశానికి కేటాయించారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ తెలిపారు. అందులో కొంతభాగం ఆక్రమణకు గురైనట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఈవిషయమై తన దృష్టికి రాలేదని చెప్పారు. విచారించి శ్మశానాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి మంత్రి అంగీకారం

దర్శి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంగీకారం తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు సోమవారం అమరావతిలో ఆయన్ను కలిశారు.

ఈసందర్భంగా డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాల ఆవశ్యకతను వివరించారు. గత మూడేళ్లగా అద్దె భవనాల్లో అరకొర వసతులతో కళాశాల నడుస్తుంది. దీంతో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరటం లేదు. దర్శి-కురిచేడు రోడ్డులో శివరాజ్‌నగర్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి స్థలం సమకూర్చారు. దీంతో కళాశాల భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేయగా అందుకు మంత్రి లోకేష్ అంగీకరించారు.

ఇదిలాఉండగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి రాష్ట్రస్థాయి పదవి ఇచ్చేందుకు నారా లోకేష్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి ఆమె ఆహర్నిశలు కృషి చేస్తున్న తీరు పార్టీ అధిష్ఠానం గుర్తించింది. ఆమె మరింత విస్తృతంగా సేవలందించేందుకు వీలుగా ప్రొటోకాల్ పదవి ఇచ్చేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.



మంత్రి నారా లోకేష్‌ను కలసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

చిరు జల్లులతో మెట్ట పైర్లకు జీవం

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో గత మూడు రోజులుగా చిరు జల్లులు కురుస్తున్నాయి. ఈ జల్లులు మెట్ట పైర్లకు ఎంతో జీవం పోస్తుందని వ్యవసాయశాఖ ఏడీఏ ఈవీ రమణ వెల్లడించారు. పొగాకు తోటలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. చిరు జల్లులతో నేల తేమగా మారటంతో శనగ, బొబ్బర్లు, మిర్చి పంట వేసుకుంటే మంచిదన్నారు. ఇప్పటికే కంది పూతకు వచ్చిందని చెప్పారు. భారీ వర్షాలు పడితే పూత రాలిపోయే అవకాశం ఉందన్నారు. అయితే, చలిగాలులతో గూడు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఇప్పటికి అలాంటి పరిస్థితి లేదన్నారు. ఒకవేళ పురుగు ఆశిస్తే వేపనూనె, క్లోరీఫైరిపాస్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. వాటి నివారణకు ఇప్పటికే ప్రతి గ్రామంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు చెప్పారు.

గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు కూడా చేస్తున్నట్లు ఏడీఏ రమణ తెలిపారు. ఇప్పటికే వంద ఎకరాలు ఈ క్రాప్ చేసినట్లు చెప్పారు. కనిగిరి వ్యవసాయ డివిజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 2,077 హెకార్లు కాగా, ఇప్పటికే 1,126 హెక్టార్లలో సాగుచేసినట్టు చెప్పారు. జొన్న 523 హెక్టార్లు, మొక్కజొన్న 51 హెక్టార్లు, ఉలవ 84 హెక్టార్లు, పెసర 60 హెక్టార్లు, మినుము 12,562 హెకార్లలో సాధారణ విస్తీర్ణం కాగా, ప్రస్తుతం మొత్తంగా 5,355 హెక్టార్లు సాగు చేసినట్లు చెప్పారు. పచ్చి శనగ 654 హెక్టార్లు, అలసంద 1585 హెక్టార్లు, వేరుశనగ 92 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, ఇందులో 196 హెక్టార్లలో సాగు చేసినట్టు చెప్పారు. అత్యధికంగా హనుమంతునిపాడు మండలంలో సాగు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న జల్లులతో ఈ పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు. పంటలకు చీడ,పీడ ఆశించినట్లయితే నష్ట నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను రైతులు పాటించాలని కోరారు.

ముసురు పడితే నష్టం తప్పదంటున్న మిరప రైతులు

పీసీపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షం 52.8మి.మీ నమోదైంది. ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన కంది పైరు కల్లె దశలో ఉండగా, రబీలో సాగుచేసిన మిరప, మినుము పంటలు పూత, కాయలతో ఉన్నాయి. ఈ వర్షంతో పూత రాలిపోయి దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో రెండురోజులపాటు ముసురు పడితే కాయలతో ఉన్న మిరపకొమ్మలు విరిగి నేలపై పడడంతో పాటు వరి పైరు పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు వినతి

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 104 అంబులెన్స్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎంఐయూ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని ఆ సంఘం నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ళు తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా విధులు నిర్వహిస్తూనే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గత 16 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

తమ డిమాండ్లను పరిష్కరించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎంఐయూ నాయకులు నాయబ్ రసూల్, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న 104 యూనియన్ నాయకులు

బంగారం దుకాణంలో చోరీ

తాళ్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరంలో సోమవారం బంగారం దుకాణంలో చోరీ జరిగింది. విఘ్నేశ్వర గోల్డ్ దుకాణంలో కమ్మలు కొనేందుకు ఇద్దరు మహిళలు వచ్చారు. ఆసమయంలో మరోఇద్దరు మహిళలు కూడా ఆభరణాల కొనుగోలుకు వచ్చారు. ఇద్దరు మహిళలు బంగారు కమ్మలు పెద్దవి చూపించమన్నారు. దీంతో దుకాణం యజమాని కమ్మల బాక్స్‌ను వారి ముందు ఉంచారు. ఆ ఇద్దరు మహిళలు వాటిని చూస్తున్నట్లు నటించి పెద్దకమ్మలను ఆరు జతలను చోరీ చేశారు. షాప్ వారు బాక్స్‌ను పరిశీలిస్తే గుర్తుపట్టకుండా తమ దగ్గరున్న ఒకటిన్నర గ్రాముల చిన్నకమల జతలను వాటి స్థానంలో బాక్స్‌లో అమర్చారు. వారి తీరుపై అనుమానం వచ్చిన షాప్ యజమాని వారిని ఆరా తీస్తున్నక్రమంలో ఒక మహిళ గబగబా బయటకు వెళ్లిపోయారు. అనుమానించిన యజమాని రెండో మహిళను పట్టుకునేందుకు యత్నించగా ఉడాయించింది. బాక్సులోని కమ్మలను గమనించగా రూ.2 లక్షల విలువగల పెద్దకమ్మలను అపహరించినట్లు షాపు యజమాని గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వటంతో దర్శి సీఐ రామారావు హుటాహుటిన బంగారం దుకాణాన్ని పరిశీలించారు. షాప్‌లోని సీసీ కెమెరాను నిశితంగా పరిశీలించగా ఆమహిళలు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు.



సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు



చోరీకి పాల్పడుతున్న మహిళలు

పోలీస్‌శాఖ అప్రమత్తమై గ్రామంలో అన్ని వీధుల్లో సీసీ కెమెరాల ద్వారా ఆమహిళలు ఎటువైపు వెళ్లింది ఆరా తీశారు. ఆయన వెంట దర్శి ఎస్సై మురళి, స్థానిక ఎస్సై మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

కనిగిరి పట్టణాభివృద్ధికి చర్యలు

- రోడ్ల విస్తరణ అందులో భాగమే!
- మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధిలో భాగంగానే రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక పామూరు బస్టాండు సెంటరులో సోమవారం రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా ఫుట్ పాత్‌లను తొలగించి చేపడుతున్న భారీ డ్రైనేజీలను శానిటరీ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో స్థానిక చిరువ్యాపారులు చెత్తా, చెదారాలను వేస్తూ చేయబోయే పనులకు ఇబ్బందులు కల్గించవద్దని సూచించారు. కనిగిరి అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పట్టణంలోని వ్యాపార కూడళ్ళలో డ్రైనేజీల్లో వ్యాపారస్థులు ఇష్టానుసారంగా వ్యర్థాలు వేయటం వల్ల మురుగు నీరు పారకుండా దుర్వాసన వస్తూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాపారస్థుల్లో మార్పు రాకపోతే ఎవరి షాపు ముందు చెత్తా చెదారాలు రోడ్లపై, డ్రైనేజీల్లో ఉంటే వారినే బాధ్యతగా చేస్తూ అపరాధ రుసుం విధించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది రత్తయ్య, ఖాదర్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైనేజీ కాలువల్లోకి చెత్తను వేయవద్దని వ్యాపారస్థులకు సూచనలు చేస్తున్న చైర్మన్ గఫార్

ముఖాముఖి

ముసురుతో పంటలకు తెగుళ్లు

కె.రాధ, ఏవో, పామూరు



ప్రశ్న: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టమా!

జవాబు: ఈ వర్షాలు సాగులో ఉన్న మెట్టపైర్లకు మంచిదే. కొద్దిగా చీడపీడలు ఆశించే అవకాశం ఉంది.

ప్ర: మండలంలో ఏఏ పంటలు సాగులో ఉన్నాయి?

జ: కంది, మినుము, వరి, అలసంద, పొగాకు సాగులో ఉన్నాయి.

ప్ర: మండలంలో ఎంత మంది కౌలు రైతులను గుర్తించారు?

జ: మండలంలో 1078 మంది కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించాం. వారికి సీసీఆర్‌సీ పత్రాలు అందజేస్తాం.

ప్ర: రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు ఇస్తున్నారా?

జ: మండలంలోని రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్కే) ద్వారా డీఏపీ, యూరియా అందజేస్తున్నాం.

ప్ర: దుకాణాల్లో రశీదులు ఇవ్వకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నారా?

జ: ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కొనుగోలుచేసే రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి. రశీదులు ఇవ్వని దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాం.

తొమ్మిది నెలలుగా జీతాలులేక పారిశుధ్య కార్మికుల అవస్థలు

దొనకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు అందడంలేదు. దీంతో కుటుంబపోషణకు అప్పులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో ప్రతిరోజు చెత్తాచెదారం తొలగిస్తూ, మురుగు కాల్వలను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు వేతనాలు అందక పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రానున్న క్రిస్మస్ పండుగ నాటికైనా తమకు వేతనాలు అందుతాయో, లేదో అంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దొనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

పామూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పేర్కొన్నారు. సోమవారం పామూరు పట్టణ 264వ పోలింగ్ బూత్ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా కొత్త్తూరు హరగోపాల్‌ను బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. సమావేశంలో బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

ముండ్లమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించటంతో పాటు వాహన పత్రాలు కలిగి ఉండాలని ఏఎస్ఐ పీవీ హనుమంతరావు అన్నారు. సోమవారం సాయంత్రం ముండ్లమూరులోని తాళ్ళూరు బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే హెల్మెట్ ధరించటం వల్ల ప్రాణాల నుంచి బయటపడవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఏసుబాబు, ఏస్కేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

దొనకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో మార్గశిర శుద్ధ పోలిపాడ్యమి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీ గోవిందమాంబ సమేతా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి, శ్రీకాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీమహాగణపతి, శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి, శ్రీఅయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు, పడిపూజ, కోటి దీపారాధనలు, సహస్రదీపార్చనలు, గోపూజలు నిర్వహించారు. మహా నైవేద్యాలు సమర్పించి సామూహిక హారతులు ఇచ్చారు.

భగవద్గీత ప్రచారం

కురిచేడు, డిసెంబరు 2: మండలంలోని ఆవులమంద, కాటంవారిపల్లె గ్రామాలలో దొనకొండ మండలానికి చెందిన ప్రబోధ సేవాసమితికి చెందిన సభ్యులు సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులకు త్రైత సిద్ధాత భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు టి.ఏడుకొండలు, సభ్యులు చెన్నకేశవులు, బాలరంగయ్య, నవీన్, వైష్ణవి, కొండమ్మ, సరస్వతి, సుబ్బమ్మ, సుమలత, లక్ష్మీ, సుకన్య, సీతమ్మ పాల్గొన్నారు.

నేడు పామూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో 132కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్ జిలానిబాషా ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఎనిమిది మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు జలవనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో మిర్చి, వరి తదితర పైర్లకు తెగుళ్ల సోకుతున్నందున పురుగు మందులు పిచకారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది పొలాలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ వి.సంధ్యారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ వరప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, ఆత్మ డీపీడీ సుబ్రమణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ పనుల నుంచి వీఆర్వోలను మినహాయించాలి

పామూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పనులతో ఒత్తిడికి గురవుతున్న తాము గ్రామ పంచాయతి పనులు చేయడంలేదంటూ మెమోలు జారీచేయడం తగదని పామూరు వీఆర్వోల సంఘ నాయకుడు బూదాల కుమార్ పేర్కొన్నారు. పామూరు -3 వీఆర్వో వి.మనోజ్‌కు ఇన్‌చార్జ్ పంచాయతి కార్యదర్శి జి.రత్నకుమార్ మెమో జారీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ బీవీ రమణరావుకు స్పందనలో వినతిపత్రం అందజేశారు. సీసీఎల్ఏ ప్రకారం రెవెన్యూ విధులు కాకుండా ఇతర పనులు అప్పగించవద్దని జీవో ఉన్నప్పటికి ఇంటి పన్నులు, డోర్‌టూ డోర్ సర్వే పనులు చేయడంద్వారా ఇతర ప్రభుత్వ పనుల్లో వెనుకపడుతున్నామని ఈసందర్భంగా కుమార్ పేర్కొన్నారు. ఇంటి పన్నుల ఆన్‌లైన్ చేయలేదని మెమో ఇవ్వడం తగదన్నారు. పంచాయతీ పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటస్వామి, చెన్నకేశవులు, మండ్ల శ్రీను, సరస్వతి, గరీబా, రఫి, సుధాకర్, డి.శ్రీను, ఖాజావలి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

దర్శి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ బాధిత పిల్లలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ డి.సుమన్, కంటి వైద్యాధికారి డాక్టర్ గీతాపద్మ, లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ అధ్యక్షుడు తమ్మవరపు ఫణిబాబు 15మంది బాధిత మహిళలకు రూ.25 వేల విలువచేసే నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పానుగంటి సత్యనారాయణ, కోశాధికారి గుడిపాటి అశోక్, కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, బూదాటి అంజనేయులు, చింతా తిరుపతిరెడ్డి, డి.వెంకటరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన గురుకుల విద్యార్థి



బంగారు పతకాలు సాధించిన విద్యార్థి నరేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అహరోన్, ఉపాధ్యాయులు

కురిచేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభచాటారు. కురిచేడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జి.నరేంద్ర కుమార్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో మూడు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యాలయ సంస్థ గత నెల 28 నుంచి 30 వరకు ఏలూరు జిల్లా పెద్దవేగిలో రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను నిర్వహించింది. ఈ పోటీలలో కురిచేడు విద్యార్థి పరుగు పందెంలో ఈ పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అహరోన్, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.1,04,670

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి వివిధ రూపాల్లో ఆదివారం రూ.1,04,670 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.50,710, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,480, శాశ్వత అన్నదానంకు రూ.22,480, ఇతర విరాళాల ద్వారా రూ.9 వేలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం స్థానిక చెప్పుల బజారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ షాపునకు డెకరేషన్‌లో భాగంగా యలమంద అనే వ్యక్తి ఎలక్ట్రిల్ సీరియల్ సెట్ వేస్తున్నాడు. ఈక్రమంలో షాపునకు దగ్గరలో ఉన్న విద్యుత్ మెయిన్‌లైన్‌కు యలమంద చేయి తగిలింది. దీంతో విద్యుత్ షాక్ కొట్టడంతో షాపు పైభాగం నుంచి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వైద్యులు పరీక్షించి ప్రస్తుతం ప్రాణాపాయం లేదని చెప్పారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముండ్లమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పూరిమెట్లలో సోమవారం మండల గ్రాంటు నుంచి రూ.2 లక్షలతో బోరు వేసేందుకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, నారాయణ, కంచుమాటి శ్రీనివాసరావు, గంగినేని శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలపై పర్యవేక్షణకు సిబ్బంది కొరత

కురిచేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలువలపై పర్యవేక్షణకు సిబ్బంది కొరత వేధిస్తుందని దర్శి ఎన్ఎస్పీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు రామకృష్ణ పేర్కొన్నారు. కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువ కట్టపై చెత్త, కోళ్ళ వ్యర్థాలు వేస్తున్నారు. ఈక్రమంలో 'డంపింగ్ మార్డులా సాగర్ కాలువ' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

రామకృష్ణ మాట్లాడుతూ దర్శి విభాగం కింద ప్రధానకాలువ 85/3 మైలు నుంచి 126వ మైలు వరకు, దర్శి బ్రాంచి కాలువ, పమిడిపాడు బ్రాంచి కాలువలు వస్తాయన్నారు. తమ పరిధిలో 115 మంది లస్కర్లకుగాను 14 మంది, 24 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లకుగాను ఏడుగురు మాత్రమే ఉన్నారన్నారు. కాలువ మీద మొలచిన మొక్కలు తొలగించడానికి, కాలువ గట్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి సిబ్బంది కొరత వేధిస్తుందని పేర్కొన్నారు. పనులను పర్యవేక్షించే సహాయక ఇంజనీర్ల కొరత కూడా ఉందన్నారు. దీంతో కాలువ కట్టలపై పర్యవేక్షణ చేయలేకపోతున్నట్లు చెప్పారు. కురిచేడు పంచాయతీ అధికారులకు తెలియజేసి కాలువ కట్టలపై ఉన్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ముందు కాలువ కట్టపై వ్యర్థాలు వేయకుండా పంచాయతీ సిబ్బంది సహకారం తీసుకోవడంతో పాటు తమ సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తామని ఆయన తెలిపారు.

లాకర్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

పామూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పామూరులోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో లాకర్ సదుపాయాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని మేనేజర్ ఆర్.చినమాబాషా ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సిటిజన్లకు 7.8 శాతం వడ్డీ, మిగిలిన ఖాతాదారులకు 7.3 శాతం వడ్డీ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

మంగళవారం 3 డిసెంబరు 2024





గుంటూరు మిర్చి యార్డు

మిర్చి యార్డులో కలవరం

- అధికారులు, ఇద్దరు సెక్రటరీలపై తీవ్ర అభియోగాలు
- ఇద్దరు ఇన్‌చార్జీలు, 12 మంది సూపర్‌వైజర్లపై కూడా
- విజిలెన్స్ విచారణతో చర్యలకు ఆదేశించనున్న ప్రభుత్వం

గుంటూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వందల కోట్ల రూపాయల అక్రమాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి రావటంతో గుంటూరు మిర్చియార్డులో కలవరం మొదలైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో యార్డులో పనిచేసిన 20 సిబ్బంది పేర్లు చేర్చటం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు అధికారులు, ఇద్దరు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీలు, ఇద్దరు యార్డు ఇన్‌చార్జీలు, 12మంది సూపర్‌వైజర్లపై తీవ్రమైన అభియోగాలు నమోదు అయినట్లు తెలుస్తోంది. నివేదికను ఆధారం చేసుకుని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉండటంతో గత ఐదేళ్ళలో యార్డులో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్ల పరుగెత్తున్నాయి.ప్రస్తుతం అప్పట్లో పనిచేసిన సిబ్బందిలో కొద్దిమంది మాత్రమే యార్డులో ఉన్నారు. మిగిలినవాళ్లు ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. యార్డులో ప్రస్తుతం 34మంది పనిచేస్తుండగా, 10మంది పేర్లు విజిలెన్స్ నివేదికలో ఉన్నట్లు సమాచారం.

ఆదాయం కోసం స్థాయి మార్పు..

గుంటూరు మిర్చియార్డులో ప్రతి ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుండగా, రూ.100కోట్ల వరకు ఆదాయం చేకూరుతోంది. వాస్తవానికి గుంటూరు మిర్చియార్డుకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీని నియమించాలి. అర్హత కలిగిన సెక్రటరీలు ఉన్నప్పటికీ మార్కెటింగ్ కమిషనర్‌తో సత్సంబంధాలు కలిగిన అధికారులు స్థాయి తగ్గించుకొని అధిక ఆదాయం కలిగిన

(మిగతా 6వ పేజీలో..)

డైరెక్టర్ సీరియస్ ?

గుంటూరు మిర్చియార్డులో జరుగుతున్న అవకతవకలపై వస్తున్న కథనాలపై మార్కెటింగ్ డైరెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ కార్యాలయం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతోనే కొందరిపై వేటుపడవచ్చని చెబుతున్నారు.





బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో ఇటీవల అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూల మూలకు విస్తరించి వున్న రేషన్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమార్కుల ఆట కట్టించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం వెరువని రేషన్ మాఫియా తాజా పరిణామాల నేపథ్యంలో ఒకింత ఆందోళనకు గురయింది. నేరుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం రేషన్ మాఫియాపై దృష్టి సారించడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మాఫియా ఏరేషన్!

- ప్రభుత్వం దృష్టి సారించడంతో అధికారుల అప్రమత్తం
- కఠిన చర్యలు తప్పవంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు హెచ్చరికలు
- గత కొంతకాలంగా ఇష్టారాజ్యంగా రేషన్ మాఫియా
- సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా పేదల బియ్యం దోపిడీ
- బినామీ షాపులతో అడ్డూ అదుపులేని అక్రమాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో విస్తరించిన రేషన్ మాఫియా జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి రేషన్‌మాఫియా అక్రమాలు ఖండాంతరాలు చేరింది. సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణ మీదుగా కర్ణాటక, గుజరాత్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు పేదల బియ్యాన్ని తరలించడమే కాకుండా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు కూడా తరలిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని కట్టడి చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమాలు మాత్రం అణువంత కూడా తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి, అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించారు. దీంతోపాటు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హెచ్చరికలు చేయడంతో మాఫియా గుండెల్లో రైళ్ల పరిగెత్తు తున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు కూడా రేషన్‌మాఫియాపై అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, విజిలెన్స్, రెవిన్యూ అధికారులు మాఫియాకు హెచ్చరికలు పంపించారు. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఇటు రేషన్‌డీలర్లకు, అటు ఎండీయూ వాహనదారులకు హెచ్చరికలు పంపారు.

● అడ్డూ అదుపులేని రేషన్ మాఫియా..

పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం రేషన్ షాపులకు చేరకముందే మాఫియా గూటికి చేరిపోయిన ఘటనలు జిల్లాలో అనేకం నమోదయ్యాయి. ప్రతి నెలా ఒకటో.తేదీన ప్రజలకు అందాల్సిన బియ్యం ముందు నెల 25వ తేదీ లోపు రేషన్ షాపులకు చేరుతుంది. కానీ కిందటి నెల 28వ తేదీకల్లా అనేక రేషన్ షాపులు ఖాళీ అయిపోయాయి. బియ్యం అక్రమార్కుల చెంతకు చేరిపోయాయి. దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకున్నా పద్ధతిలో మార్పు రాలేదు.

● ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి నేరుగా మాఫియాకు..

రేషన్ డీలర్లకు బియ్యం అందించే మండల స్థాయి స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్ల నుంచే నేరుగా పేదల బియ్యం మాఫియా డంప్‌కు చేరిపోతున్న ఘటనలు అత్యంత ఆందోళనకర పరిణామం. జిల్లాలో రెండు మూడు రేషన్ షాపులు ఒక్కటై ఈ దందా చేస్తున్నాయి. మూడు షాపుల్లో ఒక షాపుకు స్టాకు రాకుండా నేరుగా మాఫియాకు పంపిస్తారు. మిగిలిన రెండు షాపులు మూడో షాపుకు సరుకు సరఫరా చేస్తాయి. అధికారుల తనిఖీల సమయంలో ఒకరికి ఒకరు సహకరించుకుని తప్పించుకుంటున్నారు. దీంతోపాటు రేషన్ షాపు పక్కన మాఫియా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకుని అక్కడే బియ్యాన్ని డంప్ చేసుకుని

(మిగతా 6వ పేజీలో..)



అసైన్డ్ రైతులకు కౌలు

- సీఐడీ 'నాట్ ట్యాలీడ్' ఉచ్చు నుంచి రైతులకు విముక్తి
- కలెక్టర్ విచారణతో నాట్ ట్యాలీడ్ జాబితా రైతులకు మోక్షం
- కేటగిరీ 1, 2, 3 నుంచి 609 మందికి, 5,6 కేటగిరీల్లో 484 మందికి కౌలు
- రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదు
- ఏపీ సీఆర్డీఏ కమిషనర్

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతుల్లో మరో 1,093 మంది రైతులకు కౌలు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వం నమోదు చేసిన సీఐడీ కేసుల కారణంగా 'నాట్ ట్యాలీడ్' జాబితాలో చేరి అనర్హతబారిన పడి మూడేళ్లుగా కౌలుకు, చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలకు దూరమైన అసైన్డ్ రైతులకు కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం కలిగింది. గత నెల 28వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'రిజిస్ట్రేషన్ల గండం' వార్తపై సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ స్పందించారు. తొలి విడత జాబితా కింద ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను 'నాట్ ట్యాలీడ్' జాబితా నుంచి విముక్తి చేసి కౌలు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 1,093 మందికి కౌలు చెల్లించనున్నామని, వారి రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు.

● కలెక్టర్ విచారణ అనంతరం విముక్తి

రాజధాని కోసం ఎల్‌పీఎస్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతులను ఆరు కేటగిరీలుగా గుర్తించామని చెప్పారు. కేటగిరీ-1 గా మాజీ సైనికులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ బాధితుల భూములు, కేటగిరీ- 2, 3 కింద 1954కి ముందు అసైన్ చేసిన భూములు, కేటగిరీ- 4 కింద శివాయజమేదార్లుగా పరిగణించిన భూములు, కేటగిరీ- 5 కింద అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులు, కేటగిరీ- 6 కింద అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులుగా గుర్తించారు. ల్యాండ్ పూలింగ్‌లో వీరంతా భూములివ్వగా అప్పటి టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

ఉపకార వేతనాల పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధితాధికారులతో సోమవారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ప్రతిభ ఉపకారవేతనాల పరీక్షలు ఈనెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాలలో జరుగుతాయన్నారు. 2,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. 10 మంది చీఫ్ సూపరింటెండెంట్లు మరో 10 మంది అధికారులు, 99 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాథమిక వైద్యం అందించటానికి 20 మంది ఏఎన్ఎంలను నియమించామన్నారు. పరీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్‌సెంటర్లు మూసివేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి : కలెక్టర్

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్టూడెంట్స్ అసెంబ్లీకి కలెక్టర్ హాజరయ్యారు. జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశం ఈనెల 7న జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు.

నందిగం సురేశ్‌కు మరో 14 రోజుల రిమాండ్

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. తుళ్లూరుకు చెందిన మరియమ్మ అనే వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించి సురేశ్ జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్నారు. రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో పోలీసు వ్యానులో మంగళగిరి కోర్టుకు తీసుకువచ్చారు. న్యాయ మూర్తి మరో 14 రోజులపాటు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వు లిచ్చారు. అనంతరం సురేశ్‌ను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.



పోలీసు వ్యానులో నుంచి అభివాదం చేస్తున్న నందిగం సురేశ్

వదలని ముసురు

- తుఫాన్ ప్రభావంపై అన్నదాతల్లో గుబులు
- కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం... అక్కడక్కడా చిరుజల్లులు
- వరి కోత కోయడానికి జంకుతున్న రైతులు
- ఎంతో కొంత నష్టం తప్పదని ఆవేదన
- ఇప్పటికి1600 టన్నుల ధాన్యం సేకరణ

దాదాపు ఐదు రోజుల నుంచి వర్షం దోబూచులాడుతూనే ఉంది. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో కూడా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వారం రోజుల క్రితమే హెచ్చరించిన సంగతి తెలిసిందే. అది మొదలుకుని అన్నదాతల కంటిమీద కునుకే కరువయింది. ఒక వైపు కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు ఉంటే మరోవైపు వర్షం హెచ్చరికలు వారిని కుదురుగా ఉండనీయకుండా చేసింది. సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ఇలా రోజుల తరబడి ముసురుపట్టడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మూడు రోజుల క్రితం వరకు తుఫాన్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో గండం గడిచినట్లేనని రైతాంగం ఊపిరి పీల్చుకుంది. కానీ తుఫాన్ తీరం దాటిన సమయంలో జిల్లాలో కూడా వర్షం ప్రభావం ఓ మోస్తరుగా కనిపించడం.. రోజుల తరబడి ముసురు వాతావరణం ఉండడం కూడా రైతులను కలవరపెట్టేదిగా ఉంది. ఆది, సోమవారాల్లో బాపట్ల, రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు పరిధిలో ఓ మోస్తరు వర్షం కురవగా చుండూరు, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో చిరుజల్లులు రైతులను కలవరపెట్టాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు 35,000 ఎకరాల్లో వరిపైరు నేలవాలగా దిగుబడులపై ప్రమాదం చూపే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే నూర్పిళ్ల చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే విషయంలో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక కల్లాల్లో ఉన్న ధాన్యం సంగతి మరింత అధ్వానంగా ఉంది. తుఫాన్ హెచ్చరికలకు ముందే జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన 2.42 లక్షల ఎకరాల్లో వరికి గానే దాదాపు రెండు లక్షల ఎకరాల వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది. వర్షం హెచ్చరికలతో రైతులు చాలా వరకు కోతలను వాయిదా వేసుకున్నారు. కానీ ముసురు ఇలా రోజుల తరబడి ఉండడంతో అదను దాటి కోత కోస్తే కచ్చితంగా దిగుబడుల్లో తేడా రావడంతో పాటు నూక శాతం పెరిగే అవకాశం ఉందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కురిసిన ఓ మోస్తరు వర్షాలకు తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టినా మరో మూడు, నాలుగు రోజుల వరకు కోతలు కోయలేని పరిస్థితి ఉంటుందనేది రైతుల మాటగా ఉంది



పిట్టలవానిపాలెం మండల పరిధిలో నేలవాలిన వరిపైరు

దాదాపు 13,000 ఎకరాల్లో కోతలు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 13,000 ఎకరాల్లో వరికోతలు పూర్తవడంతో పాటు ధాన్యం కూడా చేతికొచ్చింది. వీటికి సంబంధించి ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 1600 టన్నులు మాత్రమే సేకరించగా మరో 3,000 టన్నుల ధాన్యాన్ని రైతులు నిల్వ చేసుకున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. కానీ దాదాపు 4,000 టన్నుల ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు చేరిపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తేమ శాతం విషయంలో నిబంధనలు సడలించినప్పటికీ రైతులు దళారులను ఆశ్రయించి అయినకాడికి ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నారు. సమీపంలో మిల్లులు లేకపోవడం తోడు రవాణా సమస్యలతో పాటు ఇతర సాంకేతిక సమస్యలు రైతులను బహిరంగ మార్కెట్‌వైపే చూసేలా చేస్తున్నాయి. వర్షం ప్రభావంతో కొంత నష్టం జరిగితే దళారులకు పంటను అమ్ముకొని రైతాంగం మరింతగా నష్టపోతోంది

గత ప్రభుత్వ వైఖరి కూడా కారణం

ఐదేళ్ల వైసీపీ పాలనలో వరి రైతులు పడిన ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిబంధనల చట్రం దగ్గర నుంచి ఖాతాల్లో డబ్బు జమ చేయడం వరకు అంతా ఒక ప్రహసనాన్ని తలపించేది. దీంతో ఏటికేటా కొనుగోలు కేంద్రాల వైపు వచ్చే రైతులు తగ్గుముఖం పట్టి బహిరంగ మార్కెట్‌లోనే అయినకాడికి పంటను అమ్ముకునే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం తేమ శాతంలో సడలింపులు మొదలుకుని ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తోంది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతూనే ఉన్నాయి. కానీ గత ప్రభుత్వ అలసత్వం ఇప్పటికీ రైతుల మెదళ్లలో ఉండిపోవడంతో నిబంధనల వంటి శల్యపరీక్షలను ఎదుర్కోవడం కంటే అయినకాడికి బయటే అమ్ముకోవడం మేలని తలంచి అరకొరగా చేతికొచ్చిన ధాన్యాన్నిసైతం నష్టానికే అమ్ముకుంటున్నారు

మరింత భరోసా కల్పించాలి

ఇప్పటికీ కోతలు పూర్తయింది దాదాపు 13,000 ఎకరాలే కావడంతో తర్వాత పంట కొనే విషయంలో అయినా అన్నదాతలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. చిరుజల్లులు, ముసురు ప్రభావంతో ధాన్యం తేమ శాతం విషయంలో రైతులకు కచ్చితంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ఒక్క గింజను కూడా ఇతరత్రా కారణాలతో తిప్పి పంపకూడదనే స్పష్టమైన ఆదేశాలను యంత్రాంగానికి ఇవ్వాల్సి ఉంది.

వర్షానికి తడిచిన ధాన్యం

కరకట్ట వెంబడి ఆరబెట్టుకుంటున్న రైతులు

రేపల్లె,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ తీరప్రాంతంలో తుఫాన్‌కారణంగా గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు వర్షం కారణంగా కరకట్టపై పోసుకున్న వరిధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. వర్షం తగ్గుముఖం పట్టటంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. సోమవారం రోజు తీరప్రాంతంలోని రేపల్లెనియోజకవర్గంలో ఉదయం సన్నపాటి జల్లుపడి ఆగిపోయింది. వర్షం నిలిచిపోవటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. చేతికందిన పంట నేలపాలవుతుందోనని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. భారీవర్షం పడకపోవటంతో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పంటపొలాల్లో కోసిన ధాన్యాన్ని కరకట్టల వెంబడి ఆరబెట్టుకున్న ధాన్యం కొంతమేర తడిచింది. తడిచిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణంలో వర్షం ప్రభావం తగ్గటంతో కోతకు వచ్చిన పంటను హార్వెస్టుల ద్వారా పంటను కోసే పనిలో నిమగ్నమయ్యారు.



రుద్రవరం కరకట్ట సమీపం వద్ద తడిచిన ధాన్యాన్ని గ్రేడ్ చేసుకుంటున్న రైతులు



కర్నూలు జిల్లా బాలుర జట్టుకు విన్నర్ కప్‌ను అందిస్తున్న సుధీర్‌నాయుడు

అంతర్ జిల్లా రగ్బీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా కర్నూలు జట్లు

» రన్నర్స్‌గా సత్యసాయి జిల్లా

» నెల్లూరు బాలుర టీంకు తృతీయస్థానం

కావలిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని ముద్దూరుపాడులోగల డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగిన సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు హాజరయ్యాయి. కర్నూలు జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణాజిల్లా జట్టు నిలిచాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని విజేతలకు కప్పులు, మెడల్స్ ప్రశంసాపత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు తమ కళాశాల వేదికవడం సంతోషంగా ఉందన్నారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోనే రగ్బీ పోటీల నిర్వహణకు వెనుకాడతామని, అలాంటిది కావలిలోని డీబీఎస్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పీడీ మురళి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న ఆటో సాంకేతిక లోపంతో అకస్మాత్తుగా ఆగిపోవడంతో, ఆటో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఆటోను ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి వద్ద జరిగింది. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం నల్లసముద్రం గ్రామానికి చెందిన మోతుకూరి ఏడుకొండలు (32)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుకొండలు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఏడుకొండలను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జీవీకి హైకోర్టులో ఊరట

ఈనెల 9 వరకు అరెస్టు చేయవద్దని ఆదేశం

ఒంగోలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైకోర్టులో ఊరట లభించింది. మద్దిపాడు పోలీసు స్టేషన్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రామ్‌గోపాల్‌వర్మపై కేసులు నమోదైన విషయం విదితమే. సోషల్ మీడియాలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లపై ఆర్జీవీ అసభ్యకరంగా పెట్టిన పోస్టులతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులు చేయగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 9కి వాయిదా వేసిన న్యాయమూర్తి అప్పటివరకు రామ్‌గోపాల్‌వర్మను అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు వినతి

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 104 అంబులెన్స్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎంయూ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని ఆ సంఘం నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ళు తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా విధులు నిర్వహిస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గత 16 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

తమ డిమాండ్లను పరిష్కరించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎంయూ నాయకులు నాయబ్ రసూల్, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న 104 యూనియన్ నేతలు

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

» పూర్తయిన నిర్మాణ పనులు

» పెచ్చులూడుతున్న భవనంలోనే కొనసాగుతున్న సేవలు

మేదరమెట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయి సంవత్సరమైనా ప్రారంభానికి నోచుకోలేదు. గతంలో సమితి కేంద్రం అయిన కొరిశపాడులో 60 ఏళ్లకి పూర్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఆరోగ్య కేంద్రం భవనంతో పాటు సిబ్బందికి క్వార్టర్స్‌ను నిర్మించారు. 20 ఏళ్ల కిందటే సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రాథమిక ఆరోగ్య క్రేందం భవనంలో ఆపరేషన్ థియేటర్‌తోపాటు మరికొన్ని గదులు పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఆరోగ్య క్రేందంలోని కొన్ని రూములలో ప్రసుత్తం కేంద్రాన్ని నడుపుతూ సేవలందిస్తున్నారు. ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని సిబ్బంది భయపడుతున్నారు.

గత ప్రభుత్వంలో కొరిశపాడు, మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన భవనాల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. ఒక్కొక్కటీ రూ.1.73లక్షల అంచనాతో నిర్మాణ పనులను ప్రారంభించారు. 2023 డిసెంబర్ నాటికి 90శాతం పనులు పూర్తి అయ్యాయి. మేదరమెట్లలోని యర్రం చిన్న పోలిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అప్పటి టీటీడీ చైర్మన్ వైసీ సుబ్బారెడ్డితో 2024 జనవరిలో ప్రారంభించారు. ఆయనతో ప్రారంభం చేయించడానికి మేదరమెట్లలో పీహెచ్‌సీ భవనం నిర్మించిన కాంట్రాకర్టర్‌లకు పెండింగ్ బిల్లులు అన్నీ చెల్లించారు. కొరిశపాడులో పీహెచ్‌సీ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభించకుండా వదిలేశారు. ఒక పక్క పెచ్చులూడుతున్న భవనంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌లు సిబ్బంది రోగులు, కొత్త భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని స్థానిక ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలు నూతన భవనం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు సిబ్బంది కోరుతున్నారు.



ప్రారంభించని కొత్త పీహెచ్‌సీ భవనం

ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచింది. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రమావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, సంగినేటి బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్ల జత

ముఖహాజరు తంటా

» రోజుకు రెండుసార్లు వేయాల్సిందే » సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన

» ఒకపూట వేస్తే అది సెలవు లెక్కే » విధులకు డుమ్మాకొట్టే వారి ఆటలకు చెక్

» జిల్లావ్యాప్తంగా అమలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు ఇక రోజు రెండుసార్లు ముఖ హాజరు వేయాల్సిందే.. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సోమవారం నుంచే అమలుచేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఎక్కువమంది విధులకు ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో వలంటీర్లను ఏర్పాటు చేయడంతో వారి ద్వారానే సచివాలయ ఉద్యోగులు పనిచేయిస్తూ కాలం వెళ్లబుచ్చారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై దృష్టిసారించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు ఉండటం లేదు. ఈ విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో లేదా వార్డులో పరిశీలనకు వెళ్లారు, లేదా మండల కేంద్రానికి వెళ్లారు అంటూ రకరకాల కారణాలు చెప్తూ తప్పించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీతోపాటు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల అమలుతోపాటు పలురకాల విధులను కేటాయించింది. వాటితోపాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూట ఇతర ఉద్యోగుల తరహాలో ముఖహాజరు తప్పనిసరిగా వేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు సచివాలయాల్లో ఇష్టారీతిన వ్యవహరించిన ఉద్యోగులు తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



ముఖ హాజరు వేస్తున్న ఉద్యోగులు

ఆరువేల మందికి పైగా ఉద్యోగులు

సాధారణంగా ఒకపూట ముఖ హాజరు వేసి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో మరొకసారి హాజరు వేయాల్సి ఉంది. కానీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఉదయం పదిన్నరలోపు, సాయంత్రం ఐదు గంటలకు తప్పనిసరిగా ముఖహాజరు ఉంటేనే ఆ రోజు విధుల్లో ఉన్నట్లు లెక్క. ఒకపూట వేయకపోయినా ఆ రోజు విధులకు డుమ్మా కొట్టినట్లే లెక్క. ఈ ముఖ హాజరు కూడా ఆ సచివాలయ పరిధిలోని 500 మీటర్ల లోపే వేయాల్సి ఉంది. ఎక్కడో కూర్చొని హాజరు వేయాలనుకుంటే ఇక కుదరదు. జిల్లాలో ఉన్న 712 సచివాలయాల్లో 6,300 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కొక్క సచివాలయంలో సరాసరిన పది విభాగాల ఉద్యోగులు ఉన్నారు. వారందరూ ఇప్పుడు తప్పనిసరిగా హాజరు వేయాల్సి రావడంతో వారిలో ఆందోళన నెలకొంది.

ఇష్టారాజ్యం ఇక కుదరదు

ఇప్పటివరకు విధులకు ఇష్టారీతిన వెళ్లిన ఉద్యోగులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేయాల్సిన సచివాలయాల్లో కొన్ని విభాగాల ఉద్యోగులు విధులకు ఎప్పుడు హాజరవుతారో కూడా తెలియదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిర్ణయం తీసుకోవడంతో వారికి మింగుడు పడటం లేదు. కాగా కొన్ని విభాగాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు విధులకు ఉదయం ఆరు గంటలకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి ఉద్యోగుల విషయంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. వ్యవసాయ, సర్వే, ఏఎన్ఎం, వీఆర్వో లాంటి ఉద్యోగులు నిరంతరం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఉండాలి. అటువంటి ఉద్యోగులు ఉదయం వెళితే సాయంత్రం వరకు విధుల్లో ఉండాల్సి వస్తుంది. అటువంటి ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆ విభాగాల ఉద్యోగులు వేచిచూస్తున్నారు.

అంతా పారదర్శకమే

» రేషన్ అక్రమాలకు పాల్పడితే కేసులు పెడతాం

» నెల రోజుల్లో 75మంది డీలర్లపై 6ఏ నమోదు

» జిల్లా వ్యాప్తంగా 3,585 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం, 42 కేసులు

» ఆంధ్రజ్యోతితో డీఎస్‌వో పద్మశ్రీ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో కార్డుదారులకు రేషన్ పారదర్శకంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించకుండా బయటకు తరలిస్తున్నట్లు నా దృష్టికి వస్తే అటువంటి వారిని ఉపేక్షించేది లేదు. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలు నిరంతరం పర్యవేక్షించడంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా కార్డుదారులకు సరుకులు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశాం. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలింపును అడ్డుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్‌ఓ) ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. జిల్లాలో తమ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తారా?

జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తమ శాఖతోపాటు జేసీ గోపాలకృష్ణ దృష్టికి వచ్చిన వెంటనే దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేసి, కేసులు కూడా నమోదు చేస్తున్నాం. జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యాన్ని వారికే అందేవిధంగా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతోపాటు రేషన్ షాపులపై కూడా నిరంతరం నిఘాను పెడుతున్నాం.

ఎన్ని రేషన్ షాపులపై కేసులు నమోదు చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 75 రేషన్ షాపులపై 6(ఏ) కేసులను నమోదు చేశాం. ఆయా షాపులకు కేటాయించిన బియ్యంలో తేడాలు ఉండటంతో కేసులు నమోదు చేశాం. గోడౌన్ నుంచి ఆ షాపునకు బియ్యం, ఇతర సరుకులు కేటాయింపులు చేసిన తర్వాత అక్కడ నిల్వలు ఉండాలి. కానీ కొన్ని షాపుల్లో తక్కువగా ఉండటం, మరికొన్నిచోట్ల ఎక్కువగా ఉండటం కనిపించింది. దీంతో ఆయా రేషన్ దుకాణాలపై కేసులు నమోదు చేశాం.

ఈనెలలో ఎన్ని క్వింటాళ్ల రేషన్ సీజ్ చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 3,585 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశాం. బియ్యం మిల్లులతోపాటు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకొని పౌరసరఫరాల గోడౌన్లకు తరలించాం. ఆ బియ్యంతో సంబంధం ఉన్న 42 మందిపై కేసులు కూడా నమోదు చేశాం. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు.



తనిఖీల సమయంలో వత్తిళ్లు లేవా?

రేషన్‌షాపుల తనిఖీలు, మిల్లులు, వాహనాల్లో తరలింపు సమయంలో పట్టుకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. మాకు ఇంత వరకు ఎలాంటి వత్తిళ్లు రాలేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా అక్రమంగా బియ్యం తరలింపు జరుగుతుంటే జాయింట్ కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు కూడా సమాచారం వస్తోంది, వెంటనే దాడులు చేసి పట్టుకుంటున్నాం. ప్రభుత్వపరంగా తమకు అన్ని విధాలుగా సహకారం ఉంది. అందువల్ల తమకు ఎటువంటి ఒత్తిడి రావడం లేదు.

మాఫియా పరేషన్!

(5వ పేజీ తరువాయి)

చీకటి పడిన వెంటనే బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. అందుకోసం మాఫియా ప్రైవేటు వాహనాలు కొనుగోలు చేసి వాటిని ఏరోజుకారోజు తరలించుకుపోతున్నారు. వాటితోపాటు పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాల్లోనే కొందరు బియ్యాన్ని మాఫియాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మాఫియా సిండికేట్ కనుసన్నల్లోనే జరగడం విశేషం.

● **బినామీ షాపులతో మాయ**

జిల్లాలో చాలా షాపులు రేషన్ మాఫియా కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు నగరంలో వున్న 204 రేషన్ షాపుల్లో 40కి పైగా రేషన్ షాపులు రేషన్ మాఫియా డాన్ అదుపులోనే వున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్ డాన్ వాటిల్లో పెట్టుబడులు పెట్టి పేదల బియ్యం అక్రమ మార్కెట్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. షాపుల్లో వచ్చే సరుకు వ్యత్యాసాలను మిగిలిన షాపులతో అనుసంధానం చేసి ఎవరికీ తెలియకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. విధిలేని పరిస్థితిలో దొరికిపోతే 'డాన్' రంగప్రవేశం చేసి చక్కదిద్దుతాడు. ఆరోపణలు వచ్చి డీలర్షిప్పుకు ప్రమాదం వస్తే డీలర్షిప్ బదిలీ బాధ్యత కూడా తీసుకుని తన అనుయాయులకే డీలర్షిప్ వచ్చేలా పావులు కదుపుతూ మాఫియాను ఏకచత్రాధిపత్యంతో నడుపుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ మాఫియా సిండికేట్ వ్యవహారాలను చక్కబెట్టి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతోంది.

● **మాఫియాకు మిల్లర్ల దన్ను**

రేషన్ మాఫియా అక్రమాలకు మిల్లర్లు దన్నుగా నిలుస్తున్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద మిల్లర్లందరినీ మాఫియా సిండికేట్లో భాగస్వాములను చేసుకుని వారి మిల్లుల్లోనే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎండీయూ వాహనదారుల దగ్గర, రేషన్ డీలర్ల దగ్గర రూ. 16 నుంచి 21 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యం పేరుతో మార్కెట్లోకి రూ. 55 నుంచి 60 రూపాయలకు చలామణీ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో 200 టన్నుల రేషన్ బియ్యం రైస్ మిల్లర్ల దగ్గర దొరికింది. రవాణాకు సిద్ధంగా వున్న లారీలను కూడా ఆయన సీజ్ చేశారు. జిల్లాలో రేషన్ మాఫియా ఎంత బలంగా వుందనేది మంత్రి స్వయంగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పేదల బియ్యం అక్రమాలపై దృష్టి సారించింది.

మిర్చి యార్డులో కలవరం

(5వ పేజీ తరువాయి)

మిర్చియార్డులో పర్సన్ ఇంచార్జిలుగా కొనసాగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి పద్ధతిలో కొనసాగిన అధికారుల నేతృత్వంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వారి పేర్లను కూడా ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసిన ఇద్దరు సెక్రటరీలు భారీ అవినీతికి పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వారి కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు జరిగినట్లు నిర్ధారించారు. రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తి యార్డు ఆదాయానికి పూర్తిస్థాయిలో గండికొట్టారు. ఈ-నామ్ పోర్టల్ నిర్వహణలోనూ, కటింగ్ వ్యాపారం ప్రోత్సహించటంలోనూ వీరిది కీలక పాత్ర అని తేల్చారు. లైసెన్స్‌ల రెన్యూవల్ వ్యవహారంలో ఒక సెక్రటరీ ఏకపక్షంగా వ్యవహరించినట్లు తేలింది. మొత్తం 286 లైసెన్స్‌లు ఉండగా, కేవలం 56కు మాత్రమే త్రిసభ్య కమిటీ అనుమతి పొందారు. మిగిలిన వాటికి సెక్రటరీనే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు తీసుకొని రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఇదే సెక్రటరీలను మార్చి మార్చి యార్డు విధుల్లో నియమించారు.

లక్షల క్వింటాళ్ల మిర్చి ఈ-నామ్‌లో పెండింగ్

యార్డులో అవినీతి, అక్రమాలు జరిగేందుకు అన్ని స్థాయిలో సిబ్బంది సహకరించారు. యార్డుకు వచ్చిన మిర్చిని ఈ-నామ్‌లో అప్‌లోడ్ చేయటం, దాన్ని క్లియర్ చేయటంలో మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సుమారు 13 లక్షల క్వింటాళ్ల మిర్చికి సంబంధించి ఈ-నామ్‌లో పెండింగ్ స్టేటస్ చూపించినట్లు విచారణలో తేలింది. ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి పనులు చేసి జీరో, కట్ బిజినెస్‌కు ఇంచార్జీలు, సూపర్‌వైజర్లు సహకరించినట్లు తెలుస్తోంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో చేతులు కలిపిన సిబ్బంది రైతుల ప్రయోజనాల కు కూడా దెబ్బ కొట్టినట్లు నిర్ధారణ అయ్యింది.

అసైన్డ్ రైతులకు కౌలు

(5వ పేజీ తరువాయి)

వీరికి చట్టబద్ధమైన కౌలు, ప్రయోజనాలు కల్పించింది. అయితే గత ప్రభుత్వం 1, 2, 3 కేటగిరీల భూములపై సీఐడీ కేసులు నమోదు చేయడం వల్ల ఆ రైతులకు సంవత్సరాది కౌలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వాటిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి నివేదికను సీఐడీ అధికారులకు పునఃపరిశీలన నిమిత్తం పంపగా తొలి విడతలో 1,234 మంది రైతులకు అర్హత లభించిందని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలు ఇస్తున్నట్లు ఈ ఆగస్టులో సీఆర్డీఏ, ప్రభుత్వం ప్రకటించింది. 1,234 మందికి వార్షిక కౌలు రూ. 22. 03 కోట్ల రూపాయలు జమ చేసింది.

● **రెండో విడతలో..**

రెండో విడతగా మరో 609 మంది రైతులకు అర్హత లభించిందని సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు. వారికి 2.35 కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు ఆమోదించగా, బిల్లు ఆర్థిక శాఖ వద్ద ఫండ్ క్లియరెన్సులో ఉన్నట్లు ఆయన వివరించారు. వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు తగిన చర్యలు అధికారులు చేపట్టారని తెలిపారు. నాట్ ట్యాలీడ్ జాబితాలో వున్న 5, 6 కేటగిరీల రైతుల పొలాలపై కూడా విచారణ జరపగా 484 మంది రైతులకు అర్హత లభించిందని ఈనెల 27న వారి కౌలు చెల్లింపులకు ఆమోదం లభించిందని, వారికి కౌలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలియజేశారు. వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకూ ఆటంకం ఉండదని, త్వరతగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు. కాగా 1,2,3 కేటగిరీలకు చెందిన అర్హత కలిగిన 683 మంది రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ ఈనెల 26న సీఆర్డీఏ కార్యాలయానికి పంపగా దానిని సీఐడీ అధికారుల పునః పరిశీలనకు పంపించారు. వారి ఆమోదం లభిస్తే వారికి కూడా వార్షిక కౌలుతోపాటు, చట్టపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందనున్నాయి.

7న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

» పండుగ వాతావరణంలో నిర్వహించాలి

» కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 7వతేదీన జరిగే మెగా పేరెంట్స్-ఉపాధ్యాయుల మీటింగ్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అన్ని పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు వేర్వేరుగా పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఈ కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రీయ బాలసురక్ష కింద విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం పెట్టే భోజనానికి అదనంగా మరో మూడు రుచికరమైన ప్రత్యేక వంటలను ఆ రోజు విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ చేసే క్రమంలో ఎదురయ్యే ఆధార్ కార్డు సవరణ సమస్యలను త్వరగా పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇంటిని ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేయాలని, అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా హ్యాబిటేషన్లు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లతో సహా సచివాలయ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజరు ఖచ్చితంగా వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్య ఘర్ పథకం కింద సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు వెంకటనాయుడు, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, రాజశేఖర్, రమేష్, జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.1,04,670

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి వివిధ రూపాల్లో ఆదివారం రూ.1,04,670 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.50,710, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,480, శాశ్వత అన్నదానంకు రూ.22,480, విరాళాల ద్వారా రూ.9వేల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.



వివిధ దశల్లో ఉన్న మొక్కజొన్న పైరు

పైర్లకు జీవం

- పంట కాలువల్లో గడ్డి దుబ్బులు తొలగించాలంటున్న రైతులు



పంట కాలువలో పారుదలకు అడ్డుగా ఉన్న గడ్డి దుబ్బులు

చీరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి కురుస్తున్న చి రు జల్లులతో సాగులో ఉన్న పైర్లన్నీ జీవం పోసుకుంటున్నాయి. దీంతో సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నష్టం నామమాత్రమేని, అన్ని పైర్లకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు చెప్తున్నారు. వరి, మొక్కజొన్న, మినుము పైర్లకు తడులు ఇచ్చే అవసరం లేకుండా ప్రస్తుత వర్షాలు ఉపకరిస్తున్నాయని చెప్తున్నారు. ఎత్తిపోతల పథకాల కింద ఉన్న పంట కాలువల్లో పలుచోట్ల గడ్డి దుబ్బులు నీటి పారుదలకు ఆటంకంగా మారాయని, వాటిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



ఘట్టేశ్వరస్వామి



బాలకోటేశ్వరస్వామి ఆలయ కోనేరు వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చినగంజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్గశర మాసం తొలిరోజున జరిగే పోలిస్వర్గంను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి, ఆలయాల వద్ద మహిళలు పూజలు చేశారు. దీనినే పోలాల అమావాస్య అని కూడా పిలుస్తారు. పోలిస్వర్గ రోజున అరటిదువ్వలో ఆవు నెయ్యితో దీపారాధన చేసి దానిని నీటిలో వదిలితే శ్రీ మహావిష్ణువు ప్రీతి చెంది వైకుంఠలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. పోలిస్వర్గ కథను అర్చకస్వాములు భక్తులకు విశదీకరించారు. అన్ని శివాలయాల్లో భక్తులు చేశారు.

మార్టూరు : మార్గశిర పోలి పాడ్యమి సందర్భంగా పోలిస్వర్గం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాల్లో దీపాలను వెలిగించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఘట్టేశ్వరస్వామి ఆలయం, జాతీయరహదారిప్రక్కన ఉన్న శ్రీదుర్గామల్లీశ్వరిస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

నిరాశపరిచిన వాన

- ఎదురుచూస్తున్న మొక్కజొన్న, పొగాకు రైతులు
- జల్లులతో రోడ్లు బురదమయం



బురద రోడ్లుతో ప్రజల అవస్థలు

బల్లికురవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే ఉపయెగం అని ఎదూరు చూసిన రైతులకు చిరు జల్లులు నిరాశను మిగిల్చాయి. వాతావరణం చల్లబడి కేవలం గాలులు వీయడంతో చిరుజల్లులతో రోడ్లు బురదమయం అయ్యాయి. మొక్కజొన్న, పొగాకు సాగు చేసిన రైతులు వాన కోసం ఎదురు చూస్తున్నారు. వాన కురవకపోవడంతో రైతులు మొక్కజొన్నకు ఇంజన్ల ద్వారా నీటిని పెడుతున్నారు. కొందరు సాగర్ నీటిని వినియోగించే పనిలో ఉన్నారు. జల్లులతో బురదగా మారిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకొల్లు : ప్రస్తుతం కురిసిన జల్లులు పొగాకు, మిర్చి, శనగకు ఉపకరస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆది, సోమవారం చిన్నపాటి వాన కురిసింది.



పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

పర్చూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి కొనుగోలు కేంద్రాన్ని పర్చూరులోని వెంకటేశ్వర కాటన్ మిల్‌లో సోమవారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు తెలిపారు. పత్తిని సీసీఐ ద్వారా మాత్రమే అమ్ముకోవాలని, ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. క్వింటా రూ.7,521 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారని సీసీఐ బయ్యర్ అరుణ తెలిపారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఓటీఎస్‌యూ ప్రసాద్, అసిస్టెంట్ బయ్యర్ అరవింద్, ఏఎంసీ సిబ్బంది సుస్మిత, ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సోమవారం టెలికం రిటైర్డ్ ఏఈ పసుపులేటి ఆంజనేయులు మనుమరాలు యశ్విత పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమానికి నిత్యావసరాలను అందజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరావు, శ్రీనివాసరావు, హరిప్రసాద్, లేవి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రావూరి రంగయ్య పాల్గొన్నారు.

దీక్షధారులకు అన్నదానం



భిక్షను స్వీకరిస్తున్న దీక్షధారులు

ఇంకొల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు హరిహర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షధారులకు 30వ రోజు సోమవారం అన్నదానం నిర్వహించారు. పోలేరమ్మ గుడిలో ఇంకొల్లు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దాతలసహకారంతో దీక్షధారులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై దూసుకుపోయిన కారు

- అక్కడికక్కడే మృతి
- రోడ్డు పక్కనే చీకట్లో ఉండడం, చూడకుండా వాహనం నడపడమే ప్రమాదానికి కారణం

ఈపూరుపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం శివాలయం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ పరిధిలోని సీతారామపేటకు చెందిన ఎలిబోలు సత్యనారాయణ(56) తన భార్యతో 15 ఏళ్ల కిందట విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో స్థానికంగా ఉన్న శివాలయం ముందు రోడ్డు పక్కన నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి, పైగా చీకటి కావడంతో గమనించని తోటవారిపాలెంకు చెందిన కారు డ్రైవర్ జంజనం శ్రీనివాసరావు నిదిరిస్తున్న వ్యక్తిపైకి కారు ఎక్కించాడు. దీం తో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ ఈపూరుపాలెం పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని సోమవారం పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి



ఆనందరావు మృతదేహం

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సైడ్ డ్రెయిన్‌లో పడి బత్తుల ఆనందరావు(40) మృతి చెందాజుజీ. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం రామకూరుకు చెందిన బత్తుల ఆనందరావు సోమవారం అద్దంకి వచ్చారు. అద్దంకిలో ఉన్న స్నేహితుడితో కొంతసేపు గడిపారు. అనంతరం రామకూరు వెళ్లేందుకు పట్టణంలోని కొత్తదామావారిపాలెం వద్ద కలవకూరు రోడ్డులో వేచి ఉన్నాడు. అటు వైపు వెళ్లే ఆటోను ఆపినప్పటికీ ఎక్కించుకోలేదు. దీంతో సమీపంలో ఉన్న సైడ్ కాలువ వద్ద కూర్చున్నాడు. ఆ సమయంలోనే సైడ్ డ్రైన్‌లో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అనంతరం స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న బంధువులు వచ్చి ఆనందరావు మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఎనిమిది మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు జలవనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవా రం అవగాహన సదస్సు నిర్వహించారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఈఈ శ్రీనివాసరావు

మణికేశ్వరం ఆలయాభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వ్యాపార, సర్వీసు వర్గాల ప్రజలు సచివాలయ సిబ్బంది చేపట్టే సర్వే కు అవసరమైన డాక్యుమెంట్లను అందజేసి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రీన్యూర్స్ (ఎంఎస్‌ఎంఈ) వ్యాపారం నిర్వహించే సంస్థల సర్వే నిర్వహిస్తున్నందున సహకరించాలని కోరారు. వ్యాపార, సర్వీస్ సంస్థ అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోర్స్‌కు ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు ఈ నెల 4వ తేదీలోపు దరకాస్తులు చేసుకుని అవకాశాన్ని సద్వినియోపర్చుకోవాలి కోరారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట ప్రభుత్వాల సర్టిఫికెట్ ఇస్తాయని తెలిపారు. వివరాలకు 9543970871, 9440635677 నెంబర్లును సంప్రదించాలని తెలిపారు.

పూనూరులో శిథిలావస్థలో పశు వైద్యశాల

- భయంతో సిబ్బంది విధులు
- నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని పోషకుల విజ్ఞప్తి



పూనూరులో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనం



బయటపడిన ఇనుప చువ్వలు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో పూనూరు పెద్ద గ్రామం. ఈ గ్రామంలోని పశువైద్యశాల ప్రస్తు తం శిథిల దశకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో పశుపోషకులు ఈ ఆసుపత్రికి పశువులను తీసుకొస్తుంటారు. అంతేగాకుండా గన్నవరం, మున్నంగివారిపాలెం, చింతగుంటపాలెం గ్రామాలకు చెందిన పోషకులు కూడా వైద్యం కోసం ఈ ఆస్పత్రికే పశువులను తెస్తారు. అయితే పశు వైద్యశాల భవనం శిథిల దశకు చేరింది. భవనంలోపల పైకప్పుకు సంబంధించి సిమెంట్ స్లాబులు రాలిపోవడంతో లోపలున్న ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దాంతో వైద్య సేవలను అందించే వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో ఏ క్షణంలోనైనా భవనం పడిపోతుందోనని భయం భయంగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ భవనాన్ని గ్రామస్థులు బత్తుల చినకోటయ్య కుమారుడు రామయ్య జ్ఞాపకార్థం గన్నమనేని కోటయ్య 1971లో సొంతనిధులతో ని ర్మాణం చేయించారు. అప్పటి నుంచి ఈ భవనంలో పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. దాదాపుగా 53 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో శిథాలవస్థకు చేరింది. గ్రామంలోని టీడీపీ నాయకులు కొత్తభవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేయాలని పశు పోషకులు కోరుతున్నారు.

రోటరీ సహకారంతో రక్తదానం

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో బాధపడుతున్న మహిళకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం చేసారు. సోమవారం రక్త హీనతతో బాధపడుతున్న కొత్తమాసు లక్ష్మీ కోటేశ్వరమ్మ అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు చెప్పగా రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరక్టర్ చుం డూరి మురళీసుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకికి చెందిన మారం సత్య సురేంద్రకుమార్ ద్వారా రక్తాన్ని సేకరించారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కోశాధికారి మల్యాది శ్రీనివాసరావు, ఏపీజీ రమేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే వెలవెల

- పలు శాఖల అధికారులు గైర్హాజరు
- దుమ్మాకొట్టినవారిపై చర్యలు: తహసీల్దార్



గ్రీవెన్స్‌కు హాజరైన తహసీల్దార్

బల్లికురవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి అధికారులు దుమ్మా కొట్టడంతో వెలవెలబోయింది. తహసీల్దార్ కవిత ఒక్కరే విధులకు పాల్గొన్నారు. మిగిలిన అధికారులు హాజరు కాలేదు. సుదూర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సంబంధిత శాఖల అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఇటీవల అధికారులు హాజరుకావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పాటించడం లేదని, ఎవరూ సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ఎంతో విలువైన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో అందరు అధికారులు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హాజరుకానివారిపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం

గ్రీవెన్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కాకపోయినా, విధులకు దుమ్మా కొట్టినా వారిపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ కవిత తెలిపారు. వచ్చే వారం నుంచి అందరు అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

భూ సమస్యలు సకాలంలో పరిష్కరిస్తాం



అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్

పంగులూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వేలో తలెత్తిన భూ సమస్యలతో పాటు గ్రీవెన్స్ ద్వారా తమ దృష్టికి వచ్చిన రైతుల సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. కార్యాలయంలో సోమవారం సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామ రైతు వీరవల్లి కృష్ణమూర్తి తన తండ్రి ద్వారా కొండమంజులూరుల రెవెన్యూ పరిధిలో సంక్రమించిన 95 సెంట్ల వ్యవసాయ భూమిని తండ్రి మరణానంతరం ఆన్‌లైన్‌లో పేరు మార్చాలని ఏళ్లగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికే ఆ భూమిని రీసర్వే చేశారని, వెంటనే ఆన్‌లైన్ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రీవెన్స్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు పాస్ పుస్తకాలు, పేరు సవరణ, ప్యామిలీ మెంబరు పత్రాలు కోరుతూ 11 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

కుటుంబంలో విషాదం నింపిన ఈత సరదా

- గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం
- శోకసంద్రంలో వీరన్నపాలెం



కుమారుడు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

పర్చూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూలినాలి చేసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుల్ని చేద్దామనుకున్న నిరుపేద కుటుంబంలో విషాదం మిగిలింది. చేతికి అందివచ్చిన కుమారుడు చెరువులో పడి మృతి చెందడం తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచింది. ఈ ఘటన మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం ఈతకు వెళ్లి పాలేటి జస్వంత్ (17) గల్లంతైన విషయం తెలిసిందే. రాత్రంతా వెతికినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయం తిరిగి గాలించగా జస్వంత్ మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. వారిని చూసి గ్రామస్థులు కూడా కంటతడి పెట్టారు. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు, కోకిల దంపతులకు చెందిన జస్వంత్ ఆదివారం స్నేహితులతో ఈతకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు.

15గంటలు శ్రమించారు

చెరువులో గల్లంతైన యువకుడు జస్వత్ మృతదేహం కోసం ఆదివారం రాత్రి నుంచి తహసీల్దార్ బ్రహ్మయ్య ఎస్ఐ మాల్యాద్రి పర్యవేక్షణలో చీరాల అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. 15 గంటల తరువాత ఎట్టకేలకు సోమవారం ఉదయం 7 గంటలకు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రక్రియ సాగినంత వరకూ తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు చెరువుగట్టుపైనే నిరీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

నిర్మాణాలు సరే.. భద్రత ఎక్కడ?

- జోరుగా సాగుతున్న వాడరేవు - పిడుగురాళ్ల హైవే పనులు
- డ్రైవింగ్ డైవర్షన్‌లో సిబ్బంది నిర్లక్ష్యం
- మృత్యుమార్గాలుగా ప్రయాణాలు
- గాలిలో ప్రాణాలు



ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో పడిఉన్న హెచ్చరిక బోర్డ్




చీరాల -పర్చూరు రోడ్డులో మృతి చెందిన అధ్యాపకుడు (ఫైల్)




స్ట్రయిట్‌కట్ వద్ద హైవే నిర్మాణ పనులు

చీరాలటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలో గత కొంత కాలంగా జరుగుతున్న వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో జిల్లా అధికారులు సైతం నిర్మాణాలను పరిశీలించి డిసెంబర్ 25 నాటికి జాతీయ రహదారి వినియోగంలోకి రావాలని పలు హెచ్చరికలు కూడా జారీ చేశారు. దీంతో పనులు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. పనులు వేగవంతంగానే జరుగుతున్నాయి. కానీ పనుల్లో నిమగ్నమైన సిబ్బంది వాహన దారులకు ఏర్పాటు చేసే డైవర్షన్ బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ప్రస్తుతం ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద లోకల్ సర్వీసు రోడ్డుపై మార్కింగ్ చేసి పిల్లర్‌లు పోస్తున్నారు. చీరాల - బాపట్ల రోడ్డులోని ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో డైవర్షన్ తాత్కాలిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే దానిని ఎవరైనా నెట్టివేశారో లేక వాహనంతో ఢీకొట్టారో తెలియదు గానీ అది కుప్పకూలి ప్రమాదకరంగా ఉంది. వాహన దారులు మాత్రం ఏమాత్రం లెక్క చేయకుండా అటువైపే వెళ్తున్నారు. మరోవైపు వాహనదారులు కూడా నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్, వివిధ పరికరాలను ఏమీ పట్టించుకోకుండా ప్రయాణాలు సాగిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఈ మార్గంలో ఈ రెండు నెలల కాలంలో చీరాల - పర్చూరు రోడ్డులో అధ్యాపకుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి లోయలో పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబం తీరని విషాదంలో ఉంది. చీరాల సమీపంలోని విజయనగర్ కాలనీ వద్ద మెటీరియల్ కారణంగా ఆటో అదుపుతప్పి నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. వాడరేవు సమీపంలోని కీర్తివారి పాలెం వద్ద కల్వర్ట్‌లో పిట్టు శ్రీను మృతి చెందారు. అయితే ఈ ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. పర్చూరు - చిలకలూరిపేట రోడ్డులో హైవే నిర్మాణాల వద్ద డైవర్షన్ సక్రమంగా లేకపోవడంతో అదుపుతప్పిన బస్ టిప్పర్‌ను ఢీకొట్టింది. ఐదుగురు సజీవదహనం అయ్యాయి. ప్రమాదాల నియంత్రణకు కొంత డ్రైవింగ్ నిర్లక్ష్యం మరికొంత హెచ్చరికల్లో లోపం ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. కోరలు చాపిన హైవేలో ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం 6,919 క్యూసెక్కులు ఉండగా సోమవారానికి 9,165 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 69.805 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 1800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రెండు ఘటనలు కుంగదీశాయ్!

"రెండు ఘటనలు నన్ను ఎంతో బాధించాయి. ఒకటి పోలియో మహమ్మారితో నా రెండు కాళ్లు పచ్చుబడిపోయాయి. సంక కర్రల సాయంతో నా బాల్యం, యువ్వనం సాగింది. ఆ తర్వాత పదిహేనేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నా రెండు కాళ్లు దిబ్బతిన్నాయి. ఇక నడవలేనని డాక్టర్లు చెప్పేశారు. వాళ్లు అలా అనడంతో చాలా కుంగిపోయాను. ఆ తర్వాత కొన్నాళ్లకు తేరుకున్నా. వైకల్యం శరీరానికే కదా. మనసుకు కాదని గ్రహించి మూడు చక్రాల బండిపై తిరుగుతూ దివ్యాంగ, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట చేస్తున్నా'నని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. దివ్యాంగుల హక్కుల సాధనతోపాటు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని, తమ గ్రామ అభివృద్ధికి పోరాడి ఎన్నో పనులు సాధించుకున్నట్లు చెప్పారు. ఆయన చెప్పిన విశేషాలు...

6

- కానీ ఏనాడూ బాధపడలా
- వైకల్యం శరీరానికే మనసుకు కాదు..
- కాళ్లు చచ్చుబడ్డా నిరంతరం పోరుబాటే నాది
- దివ్యాంగులే కాదు.. పేదల కోసమూ పోరాడా
- సొంతూరు అభివృద్ధికి పరితపించా
- సామాజిక సేవ కూడా చేస్తున్నా
- 'ఆంధ్రజ్యోతి'తో దివ్యాంగ నేత వెంకట్రావు

నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం





మనుబోలు : కాగితాలపూరులో సుడిగాలికి దెబ్బతిన్న రేకుల ఇల్లు



బుచ్చిరెడ్డిపాళెం : కనిసిరిపాళెంలో కూలిన రేకుల ఇల్లు

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన

- నెల్లూరులో వింత వాతావరణం
- జిల్లాపై ఇంకా ఫెంగల్ ప్రభావం
- సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం
- కందుకూరులో పొంగిన వాగులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం ఇంకా జిల్లాను వీడలేదు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు ప్రకాశించడంతో ఇక వాన రాదని జిల్లా ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది. అయితే, మధ్యాహ్నం తర్వాత వరుణుడు దంచి కొట్టడంతో రోడ్లపై వర్షపునీరు భారీగా ప్రవహించింది. నెల్లూరు నగరంతోపాటు గుడ్లూరు, లింగసముద్రం, సంగం ఉలవపాడు, బోగోలు, కావలి, కందుకూరు తదితర ప్రాంతాలలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

తుఫాన్ ప్రభావంతో మంగళవారం కూడా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కాగా, కందుకూరు ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి ప్రవహించగా, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

● 33.8 మి.మీ వర్షపాతం

జిల్లాలో సోమవారం 33.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుడ్లూరులో 122.2, అత్యల్పంగా వెంకటాచ లంలో 7.4 మి.మీ వర్షం కురిసింది. లింగసముద్రంలో 90.2, వలేటివారిపాళెంలో 80, బోగోలులో 77.6, ఉలవపాడులో 86.4, కావలిలో 51.2, నెల్లూరు రూరల్ లో 14.4, నెల్లూరు అర్బన్‌లో 14.4 మి.మీ వర్షం పడింది.



నెల్లూరు శివార్లలోని పెన్నా నదిలో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



కందుకూరు : మోపాడులో నీటమునిగిన వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

● నీటమునిగిన నారుమళ్లు

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుబల్లి, కాశయకాగొల్లు, దామరమడుగు, మినగల్లు, పంచేడు, రేబాల


- మిగతా 6లో..



బుచ్చిరెడ్డిపాళెం : పశువుల కొట్టం కూసం కింద నలిగిన లేగదూడ

మరో భారం!

- జగన్ పాపం.. ప్రజలకు శాపం
- ఈసారి విద్యుత్ బాదుడు రూ.1000 కోట్లు
- యూనిట్‌పై రూ.1.10 పైసల అదనపు వసూలు
- మొన్నటి భారం నెలకు రూ.23 కోట్లు.
- ఈ నెల నుంచి పడే భారం రూ.21.54 కోట్లు
- రెండేళ్ల కాలానికి రూ.1000 కోట్ల భారం



నెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరునెలలు దాటుతున్నా గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పాపం తాలుకా శాపం జిల్లా ప్రజలను వదలడం లేదు. జగన్ మోహన్‌రెడ్డి గద్దె దిగినా కరెంటు బిల్లులు షాక్ కొట్టడం ఆగడం లేదు. ప్రభుత్వం మారింది, కరెంటు బిల్లుల బాదుడు తప్పిపోయింది అనుకున్న ప్రజలకు మరో రెండేళ్లపాటు సర్దుబాటు చార్జీల పోటు తప్పేలా కనిపించడం లేదు. గౌతం ఆదానీ జగన్‌ల మధ్య కుదిరిన అక్రమ ఒప్పందం ద్వారా జగన్‌కు రూ.1750 కోట్ల ముడుపులు ముట్టాయని అమెరికా దర్యాప్తు సంస్థల ప్రకటించడంతో షాక్‌కు గురైన ప్రజలు తేరుకోకముందే ఈనెల నుంచి కరెంటు చార్జీల ధరలు మళ్లీ పెరగనున్నాయన్న సమాచారంతో షాక్‌కు గురయ్యారు.

● నిన్న...

జిల్లాలో గృహ విద్యుత్ సర్వీసులు (ఎల్‌టీ)11,94,474 ఉన్నాయి. ఈ సర్వీసుల కింద నెల వినియోగం సగటున 195 మిలియన్ యూనిట్లు. అంటే 19 కోట్ల 50 లక్షల యూనిట్లు. గత ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు ఎడాపెడా విద్యుత్ కొనుగోలు చేసిన కారణంగా ఆ భారం వినియోగదారులపై సర్దుబాటు చార్జీల రూపంలో పడుతోంది. రెండు నెలలకు ముందు సర్దుబాటు చార్జీల రూపంలో యూనిట్‌పై రూ. 1.21 పైసలు చొప్పున జిల్లా వినియోగదారులపై నెలకు రూ. 23.6 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని నవంబరు నుంచి అమలు చేశారు. డిసెంబరులో చెల్లించే బిల్లులో ఈ సర్దుబాటు చార్జీలు కలిసి ఉంటాయి.

● రేపు...

ప్రజలు ఈ భారాన్నే భరించలేకపోతుంటే తాజాగా డిసెంబరు నెల బిల్లు నుంచి (అంటే జనవరిలో చెల్లించే బిల్లు) మరో సర్దుబాటు చార్జీల పేరుతో యూనిట్‌పై మరో రూ.1.10 భారం పడనుంది. అంటే నెలకు ఖర్చు చేసే 19.50 కోట్ల యూనిట్లపై సర్దుబాటు చార్జీల పేరుతో చెల్లించాల్సిన మొత్తం నెలకు 21.54 కోట్ల రూపాయలు.

● జగన్ పాపం ఖరీదు

నవంబరు నుంచి అమలులోకి వచ్చిన సర్దుబాటు చార్జీలు, డిసెంబరు నుంచి అమలులోకి రాబోయే సర్దుబాటు చార్జీలను కలుపుకుంటే యూనిట్‌పై రూ.2.31 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు సర్దుబాటు చార్జీల రూపంలో జిల్లా ప్రజలు నెలకు సుమారు రూ. 45 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒకటో, రెండో నెలలతో ఈ పీడ విరగడైపోతుందా..? అంటే అదేం కుదరదు. 2026 డిసెంబరు వరకు ఈ పోటు భరించాల్సిందే. నెలకు రూ. 45 కోట్లు చొప్పున 24 నెలల కాలానికి జిల్లా ప్రజలు చెల్లించాల్సిన మొత్తం అక్షరాల రూ. వెయ్యి(1000) కోట్లకు పై మాటే. 2019 ఎన్నికల్లో జగన్ కూటమికి పదికి పది సీట్లను కట్టబెట్టిన నెల్లూరు జిల్లా ప్రజలకు ఐదేళ్ల పాలనలో కరెంటు చార్జీల రూపంలో జగన్ ఇచ్చిన రిటన్ గిఫ్ట్ ఖరీదు రూ.1000 కోట్లు అన్నమాట!!

జనసైన్యం సారథి ఎవరు!?

- భర్తీకాని జిల్లా అధ్యక్ష పదవి
- అధికారంలో ఉన్నా దృష్టిపెట్టని పవన్

నెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోని మూడు రాజకీయ పార్టీల్లో జనసేనది రెండవ స్థానం. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇదివరకటి కన్నా ప్రజల్లో జనసేన పట్ల ఆకర్షణ, ఆసక్తి పెరిగింది. కానీ అభిమానాన్ని కూడగట్టుకొని పార్టీని బలోపేతం చేసే దిశగా మాత్రం ప్రయత్నాలు జరగడం లేదు. జనసేన పార్టీ ఆవిర్భవించి పదేళ్లు దాటుతున్నా నెల్లూరు జిల్లాలో మాత్రం ఆ పార్టీ వేళ్లూనుకోలేదు. అలాగని ఆ పార్టీకి ప్రజాభిమానం తక్కువగా ఉందా అనుకోవడానికి కూడా వీలులేదు. నెల్లూరు జిల్లాలో మెగా కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ప్రజారాజ్యం పార్టీ తరఫున నెల్లూరు సిటీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలోనే పవన్ అభిమానులు ఉన్నారు. గత ఎన్నికల ప్రచారం నుంచి ప్రజల్లో పవన్ పట్ల ఆసక్తి పెరిగింది. ఉప ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన వ్యవహారశైలి సామాన్య ప్రజలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులను,

- మిగతా 6లో..

సీఎం నిర్ణయంతోనైనా 'ధర'కొచ్చేనా!?

- ఎమ్మార్పీ అమలు చేయాల్సిందేనని చంద్రబాబు ఆదేశాలు
- దోలాయమానంలో వ్యాపారులు
- దుకాణాల్లో అన్ని బ్రాండ్లు లభ్యం
- దిగివస్తున్న బార్ల యాజమాన్యాలు
- ఎమ్మార్పీకేనంటూ బోర్డుల ఏర్పాటు

నెల్లూరు (క్రైం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్యంషాపుల్లో అధిక ధరకు మందు విక్రయాలపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మార్పీ కచ్చితంగా అమలు చేయాల్సిందేనంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న తొలిసారి పట్టుబడితే రూ.5 లక్షల అపరాధ రుసుము, రెండోసారి పట్టుబడితే ఆ సాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. అయితే, నిన్నటిదాకా ఎమ్మార్పీకన్నా అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులకు ఇది మింగుడుపడటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వైన్‌షాపులను అందుబాటులోకి తీసుకు వచ్చింది. జిల్లాలో 182 వైన్‌షాపులు ఏర్పాటు చేసి ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. కానీ వ్యాపారులెవరూ ఆ ఆదేశాలను పట్టించుకోలేదు. పైగా పెట్టిన పెట్టుబడి త్వరగా రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో ఎమ్మార్పీకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తూ బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ నాయకులు కూడా ఉండటం కొసమెరుపు. అయితే, తాజాగా ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ధరలు దిగి వస్తాయా!? అన్నది వేచి చూడాలి. మరోవైపు అన్ని బ్రాండ్లు వైన్‌షాపుల్లోనే లభ్యమవుతుండటంతో మందుబాబులు బార్‌లకు వెళ్లడం తగ్గించేశారు. దీంతో చేసేది లేక బార్ల యాజమాన్యం కూడా ఎమ్మార్పీకే మద్యం అమ్మే స్థాయికి వచ్చేశారు.

● గత ప్రభుత్వంలో దోపిడీ

వైసీపీ ప్రభుత్వంలో బార్లలో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్ల మద్యం అందుబాటులో లేకపోవడం, బార్లలో మాత్రం దొరుకుతుండటంతో మందుబాబులు అక్కడకే వెళ్లేవారు. దీన్ని ఆసరా చేసుకుని బార్ల యాజమాన్యం సిండికేట్‌గా మారి ఎమ్మార్పీపై రూ.70 నుంచి 150 వరకు పెంచారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వైన్‌షాపులు అందుబాటులోకి రావడం, ఎమ్మార్పీ పక్కాగా అమలు అవుతుండటంతో బార్లకు మందుబాబులు వెళ్లడం తగ్గించారు. దీంతో బార్ల యాజమాన్యం ఎమ్మార్పీపై ధర తగ్గించుకుంటూ వస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం కొన్ని బార్లలో మాత్రం పాత ధరలే ఉన్నా అనేక బార్లలో మాత్రం ఎమ్మార్పీపై రూ.20 నుంచి 80 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. కొన్ని బార్లలో అయితే ఇంకాస్త ముందుకు అడుగులు వేసి ఎమ్మార్పీకే మద్యం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



మద్యం దుకాణం ముందు మందుబాబుల సందడి



నెల్లూరు నగరంలోని ఓ బారు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పొంగిన వాగులు, వంకలు

- కందుకూరులో చెరువులకు జలకళ
- భారీ వర్షంతో పంటలకు అపారనష్టం



కందుకూరు : చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

'ఫెంగల్' ప్రభావంతో ఆదివారం రాత్రి కందుకూరు ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం కురిసిన వర్షంతో ఈ ప్రాంతంలోని మన్నేరు, పందివాగు, తూములేరులు ఉధృతంగా ప్రవహించగా లోతట్టుప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. ముదురు పొగతోటలకు, మినుము పైర్లకు అపారనష్టం జరుగుతుందని రైతులు అంటున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో ఆకు జిగురు కారిపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. మండలంలోని మన్నేరు, ఉప్పుటేరు, పందివాగు, తూములేరులు పొంగి ప్రవహించటంతో కందుకూరు ప్రాంతంలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే మీడియం ఇరిగేషన్ చెరువులు నిండే దశకు చేరగా, కొన్ని చెరువులకు పూర్తి సామర్థ్యంతో నీరు చేరిం ది. రాళ్లపాడు రిజర్వాయరుకు మాత్రం పెద్దగా నీరు చేరలేదు. ఆదివారం సాయంత్రానికి 17 అడుగుల నీటిమట్టం ఉండగా, సోమవారానికి 5 అంగుళాల మేర నీటిమట్టం పెరిగింది.

\- కందుకూరు (ఆంధ్రజ్యోతి)



పొగనాట్లను పరిశీలిస్తున్న అధికారులు,



పండాకు తెగులు సోకిన మినుము పంట





వలేటివారిపాలెంలోని హౌసింగ్ కార్యాలయం ముందు, ఎమ్మార్పీ కార్యాలయం వద్ద వర్షపు నీరు

రెండు ఘటనలు కుంగదీశాయ్!

భగవంతుడు ఇచ్చిన వైకల్యానికి కుంగిపోకుండా మనసులో ఆ భావం తొలగిస్తే సకలాంగులకు తీసి పోకుండా సమాజసేవ చేయవచ్చని నిరూపిస్తున్నారు వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధానకార్యదర్శి మండవ వెంకట్రావు. తన రెండు కాళ్లు సచ్చుబడిపోయినా మూడుచక్రాల వాహనంపై తిరుగుతూ దివ్యాంగులు, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో తన భావాలను వెంకట్రావు పంచుకున్నారు.

- కానీ ఏనాడూ బాధపడలా
- వైకల్యం శరీరానికే మనసుకు కాదు..
- కాళ్లు సచ్చుబడ్డా నిరంతరం పోరుబాటే నాది

- 'ఆంధ్రజ్యోతి'తో దివ్యాంగ నేత వెంకట్రావు
- నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



మంత్రి నారా లోకేష్‌తో మండవ వెంకట్రావు (ఫైల్)

కావలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం బసవన్నపాలెం నుంచి 60 ఏళ్ల కిందట వెంకటక్రిష్టయ్య, సుబ్బమ్మలు జిల్లాలోని కావలి మండలం చౌదరిపాలెంకు వలస వచ్చారు. ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ తన ముగ్గురు పిల్లల్ని పోషించుకుంటున్నారు. ముగ్గురిలో పెద్ద కుమారుడు అయిన వెంకట్రావు 6నెలల వయసులోనే పోలియో బారిన పడి కాళ్లు సచ్చుబడ్డాయి. సంక కర్రల సహాయంతో నడుస్తుండేవారు. అయితే, 15 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు గాయపడి పూర్తిగా నడవలేని స్థితికి చేరుకున్నారు. అప్పటి నుంచి మూడు చక్రాల వాహనంపై తిరుగుతూ దివ్యాంగులు, పేదప్రజలకు సేవలు అందిస్తున్నారు.

ఎన్నో పోరాటాలతో..

చౌదరిపాలెంలో అంతర్గత రోడ్లు, గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు, వాగుపై చప్టా వంటి అభివృద్ధి పనులను వెంకట్రావు పోరాడి సాధించుకున్నారు. అలాగే గ్రామంలో మహిళలను పొదుపుగ్రూపులుగా ఏర్పాటు చేయటంలో కూడా ఆయన చొరవ చూపారు. ఆ తర్వాత అక్కడ నుంచి కావలిపట్టణ ముసునూరుకు కాపురం వచ్చి అక్కడ ప్రభుత్వ రాయితీతో సిమెంట్ బ్రిక్స్ ఇండస్ట్రీ పెట్టి పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతేకాదు.. అలా వచ్చే ఆదాయంతో దివ్యాంగుల కోసం వెచ్చిస్తున్నారు. దివ్యాంగుల ఆశ్రమం పెట్టి నాలుగేళ్లు నడిపారు. దివ్యాంగులంకు నివేశనస్థలాలు ఇప్పించాలని ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు వంటి ఎన్నో పోరాటాలు చేసి వారికి ముసునూరులో నివేశన స్థలాలు ఇప్పించారు. దివ్యాంగులకు ప్రతిఏటా ఆటలపోటీలు, వైద్యశిబిరాలు, దుస్తులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, దాతల సహకారంతో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, సంక కర్రలు వంటి పలు పరికరాలను అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న దివ్యాంగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. దివ్యాంగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి కూడా తీసుకెళ్లి వారికోసం పోరాడారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రస్తుత గ్రంథాలయ సంస్థల రాష్ట్ర చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మనసులో వికలాంగుడనే భావాన్ని తొలగిస్తే దివ్యాంగులు కూడా సమాజంలో ఎవరికీ తీసిపోరనేందుకు తానే నిదర్శనం అని వెంకట్రావు చెబుతున్నారు.

ఫొటోగ్రఫీలో సూర్యప్రకాశ్‌కి బంగారు పతకం

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పిక్టోరియల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే సూర్య ప్రకాశ్‌రావుకు బంగారు పతకం అందుకున్నారు. ఆచార్య నాగార్జున వర్సిటీ, ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గత నెలలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయన విజేతగా నిలిచారు. ఈ క్రమంలో సోమవారం నాగార్జున వర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ కే రామమోహన్‌రావు చేతుల మీదుగా బంగారు పతకం, నగదు బహుమతి, స్వర్గీయ శ్రీమతి చిత్రాంగదశర్మ మెమోరియల్ అవార్డును సూర్యప్రకాశ్‌రావు అందుకున్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కే గంగాధర్, ఏఎన్‌యూ ఆర్ట్స్, కామర్స్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎం సురేష్, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ హెడ్ జే మధుబాబు, ఫొటో జర్నలిజం విభాగం చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ రామ్మోహన్ రావు నుంచి బంగారు పతకం అందుకుంటున్న హెచ్ఎం సూర్యప్రకాశరావు

జీవో నెం.73ని అమలు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికుల కోసం గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 73ను అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికులు నిరసన వ్యక్తంచేసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రబీసాగు కింద వరినాట్లు ప్రారంభమ య్యాయన్నారు. ఈ సమయంలో వ్యవసాయ కార్మికులకు సరైన కూలి అందేలా జీవో నెంబరు 73ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మస్తానయ్య, గండవరపు శ్రీనివాసులు, రఘురామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వాన

(5వ పేజీ తరువాయి)

తదితర గ్రామాల్లోని వరి నాట్లు, నారుమళ్లు నీటమునిగాయి. కొన్ని పంటకాలువల్లో పూడిక తీయకపోవడం, అధికారుల ముందుచూపు లేకపోవడంతోనే నీరంతా పొలాల్లోకి చేరిందని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో 2రోజులు వర్షాలు కురిస్తే భారీగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాలకు పలుచోట ఇళ్లు, గిరిజనుల గుడిసెలు కూలాయి. కనిసిరిపాళెంలోని నెల్లూరు నాగరాజుకు రేకుల ఇల్లు ఆదివారం కూలింది. రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం వాపోతోంది. పెనుబల్లిలో పశువులకొట్టం కూలి మల్లికార్జునకు చెందిన లేగదూడ మృత్యువాతపడింది. కనిసిరిపాళెం, పెనుబల్లిలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

'జనసేన'కు సారథి ఎవరు?

(5వ పేజీ తరువాయి)

అభిమానులను ఆకట్టుకొంటోంది. ప్రజల్లో ఇంత ఆదరణ పెరుగుతున్నా, గత చరిత్ర ఆధారంగా చూస్తే బలమైన పట్టు ఉన్నా పార్టీ నిర్మాణం జరగకపోవడం పవన్ అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. పార్టీ ఆవిర్భావం జరిగిన చాలా ఏళ్ల తరువాత జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి నియామకం జరిగింది. మనుక్రాంత్‌రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొంతకాలం పనిచేశారు. ఈయనకు సమాంతరంగా కేతంరెడ్డి వినోద్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేశారు. పాదయాత్ర పేరుతో నగరంలోని గడప గడప తొక్కారు. అయినా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి మనుక్రాంత్‌రెడ్డికి దక్కింది. పార్టీ కోసం ఎంత కష్టపడినా తనకు గుర్తింపు లేదని వినోద్ పార్టీని వీడారు. ఎన్నికల చివర్లో విజయసాయిరెడ్డి ప్రభావానికి లోనై మనుక్రాంత్‌రెడ్డి వైసీపీలో చేరిపోయారు. ఈయన ఉన్నప్పుడు కూడా పార్టీ ఏకతాటిపై నడిచిన సందర్భాలు లేవు. పార్టీ నాయకుల మధ్య ఆదిపత్య పోరు నడుస్తూనే ఉంది. ఎన్నికలు పూర్తయి, పార్టీ అధికారంలోకి వచ్చిన తరుణంలో పార్టీని బలోపేతం చేసుకోవడానికి గతానికన్నా మెరుగైన అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినా జన సేనాని జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్టీ నిర్మాణంపై దృష్టి సారించకపోవడం ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర నిరాశ వ్యక్తం అవుతోంది.

రేపటి నుంచి సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన యువతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కోర్సుకు ఎంపికైన వారు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా శిక్షణ అందిస్తామని పేర్కొ న్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి, ఆపై చదివిన వారు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 8639867407ను సంప్రదించాలని తెలిపారు.

జనవరి 20 నుంచి వీఎస్‌యూలో 'నీలి విప్లవం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీలో వచ్చే జనవరి 20, 21 తేదీల్లో నీలి విప్లవం (సముద్ర వ్యవస్థల)పై ప్రత్యేక అంతర్జాతీయ సమావేశం జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆవిష్కరించారు. సముద్ర వనరుల సరికొత్త వినియోగం, పర్యావరణ పరిరక్షణ, సముద్ర సంబంధిత రంగాల్లో ఆధునిక, సాంకేతికతలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ విభాగాధిపతి హనుమారెడ్డి, వెంకటరాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి వర్క్‌షాపులు దోహదం

వెంకటాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో విద్యార్థుల అభివృద్ధికి వర్క్‌షాపులు దోహదపడతాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. వీఎస్‌యూలో సోమవారం పరిశోధన, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఇన్క్యుబేషన్, ఉపాధిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహించడం వల్ల విద్యార్థులకు, పరిశోధకులకు ఉత్తేజాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వంశీకృష్ణ, ఉదయ గౌరి శంకర్, పార్థసారధి, డాక్టర్ ఆర్ మధుమతి, సుజాఎస్ నాయర్, డాక్టర్ జే విజేత, డాక్టర్ సాయిస్రవంతి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ వై విజయ, డాక్టర్ చెంచురెడ్డి తదితరులున్నారు.

జిల్లాలో కోళ్లకు అంటువ్యాధి

అమరావతి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదలకూరు మండలం చాటగొట్ల, కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామాల్లో కోళ్లకు ఎవిన్ ఇన్ఫ్లూయెంజా అనే అంటువ్యాధి వ్యాప్తి చెందిందని ప్రభుత్వం గుర్తించింది. జంతు వ్యాధుల నియంత్రణ చట్ట ప్రకారం ఈ రెండు గ్రామాలు కోళ్ల అంటువ్యాధుల గ్రామాలుగా ప్రభుత్వం డీనోటిఫై చేసింది. ఈ గ్రామాలకు చుట్టుపక్కల కిలోమీటరు దూరం వరకు నియంత్రిత ప్రాంతంగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రక్తం అందించి.. ఆదర్శంగా నిలిచి!

ఒక ఆలోచన మనిషి జీవితాన్నే మార్చేస్తుం ది. అవును ఇది నిజం. తన చిన్నప్పుడు సకాలంలో రక్తం అందక ఎంతోమంది చనిపోవడం ఆ యువకుడిలో సామాజిక స్పృహను మేల్కొలిపింది. సామాజిక మాధ్యంలో ఏర్పడిన 'లైఫ్‌లైన్ ఫౌండేషన్' ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. నాలుగు రాష్ట్రాల్లో 32 వేల మంది సభ్యులతో ఎవరికి రక్తం కావాలన్నా వెంటనే అందించి ప్రాణాలు నిలబెడుతున్నారు తాకొండ నవీన్.

\- కొండాపురం (ఆంధ్రజ్యోతి)



రక్తదానం చేస్తున్న తాటికొండ నవీన్ (ఫైల్)

- ఒకరితో మొదలై 32వేల మందితో ఫౌండేషన్
- నాలుగు రాష్ట్రాల్లో విస్తరించిన సేవలు
- అవార్డులు, పురస్కారాలు అందుకున్న నవీన్

కొండాపురం మండలం సాయిపేటకు చెందిన తాటికొండ నవీన్ రైతు కుటుంబం పుట్టి ఎంబీఏ పూర్తి చేశారు. హైదరాబాదులోని ఒక ప్రైవేటు కంపెనీలో హెచ్ఆర్ విభాగంలో ఉద్యోగం సంపాదించారు. తన గ్రామం, చుట్టుపక్కల గ్రామాలలో రక్తం అందక ఎంతోమంది చికిత్స అందుతున్న సమయంలోనే మృత్యువాత పడటం నవీన్ కళ్లారా చూశారు. అటువంటి వారిని కాపాడాలనే లక్ష్యంతో కొందరు యువకులను కలుపుకొని (ఫేస్‌బుక్) ఒక గ్రూపును తయారుచేసి 'నెల్లూరు బ్లడ్‌బ్యాంక్'గా నామకరణ చేశారు. నెల్లూరులో రక్తం అవసరమైన వారు తమ వివరాలను గ్రూపులో పోస్ట్ చేసిన వెంటనే ఆ ప్రాంతంలోని గ్రూపుసభ్యులకు సమాచారం అందిస్తారు. వారు వెంటనే స్పందించి బాధితుడి వద్దకేవెళ్లి స్వచ్ఛందంగా రక్తం ఇచ్చి ప్రాణాలను కాపాడుతున్నారు. దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు తన సేవలను అందించాలనే ఉద్దశంతో నెల్లూరు బ్లడ్ బ్యాంకను 'లైఫ్‌లైన్ ఫౌండేషన్'గా మార్పు చేశారు.

ఒక్కరితో మొదలై...

2015లో నవీన్‌తో మొదలైన సేవలు తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలో సుమారు 32 వేల మందితో లైఫ్‌లైన్ ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నాయి. గ్రూపులో ఎక్కువ మంది యువకులు, ఉద్యోగులు, విద్యార్థులే ఉన్నారు. ఇప్పటివరకు సుమారు 3,500 మందికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడినట్లు నవీన్ చెబుతున్నారు. తన తండ్రి రామ్మూర్తినాయుడు సలహాతో తొలిత తమ స్వగ్రామమైన సాయిపేటలో రక్తదాన శిబిరం నిర్వహించానని, ఆ తర్వాత ఎన్నో ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించినట్లు తెలిపారు.

45 పురస్కారాలు

లైఫ్‌లైన్ ఫౌండేషన్ ద్వారా తాటికొండ నవీన్ చేస్తున్న సేవలను గుర్తించిన పలు సంస్థలు ఇప్పటివరకు 45 అవార్డులు, పురస్కారాలు అందజేశాయి. 2016లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు అకాడమీ (హైదరాబాదు) వారు అవార్డును అందజేయగా, ఆ తర్వాత ఐక్రాస్ సంస్థ, 2017లో నెల్లూరు శివాజీ యూత్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థలు సంయుక్తంగా ఛత్రపతి బహుమతిని అందించి సన్మానించాయి. ఆంధ్ర, తెలంగాణా ఎన్జీవోల నుంచి అవార్డు అందుకోవడమే గాక కరోనా సమయంలో చేసిన సేవలకు ఎన్నో స్వచ్ఛంద సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో దాదాపు 32 ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందుకున్నారు.



అవార్డు అందుకుంటూ..

మిత్రుల సహాయంతోనే..

ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేశాను. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఎందరో మిత్రులు 'లైఫ్‌టైం ఫౌండేషన్'లో సభ్యులుగా ఉన్నారు. వీరందరి సహకారంతోనే బాధితులను ఆదుకుంటున్నాము. రక్తం కావాల్సినవారు 9092490767 నెంబరుకు ఫోన్ చేసి చెబితే చాలు దాతలు అక్కడకు చేరిపోతారు.

\- తాటికొండ నవీన్

అంతర్ జిల్లా రగ్బీ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా కర్నూలు జట్లు

- రన్నర్స్‌గా సత్యసాయి జిల్లా జట్లు
- నెల్లూరు బాలుర జట్టుకు తృతీయస్థానం

కావలిటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులోగల డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగిన సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాల,బాలికల జట్లు హాజరయ్యాయి. కర్నూలు జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణాజిల్లా జట్టు నిలిచాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని విజేతలకు కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు తమ కళాశాల వేదికవడం సంతోషంగా ఉందన్నారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోనే రగ్బీ పోటీల నిర్వహణకు వెనుకాడతామని, అలాంటిది కావలిలోని డీబీఎస్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పీడీ మురళి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తృతీయస్థానం సాధించిన జిల్లా బాలుర జట్టుకు కప్పు అందిస్తున్న దామిశెట్టి సుధీర్ నాయుడు

బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదు

● ఎమ్మెల్యే ఇంటూరి


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): విధి నిర్వహణలో ఉద్యో గులు, సిబ్బంది బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. కూనిపాలెం పంచాయతీ కార్యదర్శి స్టాలిన్ సమీక్షకు అలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో సోమవారం మండలాధికారులతో సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు, మండల గ్రాంటు మంజూరయినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గ్రామస్థాయిలోని పాలకులను సమన్వయం చేసుకొని, అధికారులు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని తెలిపారు.కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యేకు ఎంపీడీవో, ఈవోఆర్డీ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, వైద్యాధికారిణి మణిదీపిక తదితరులు పాల్గొన్నారు.

నష్ట నివారణ చర్యలు చేపట్టండి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తక్షణం నష్ట నివా రణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మండల వ్యవసాయా ధికారి వీ రాము ఆధ్వర్యంలో కేవీకే శాస్త్రవేత్త ఈ. వెంకటేష్ తదితరులు సోమవారం మండలంలోని ఓగూరు, మహదేవపురం, పలుకూరు, మోపాడు గ్రామాల్లో పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలో అధిక తేమ, చల్లని వాతావరణం కారణంగా మినుముకు బూడిద తెగులు సోకకుండా లీటరు నీటికి గ్రాము మైక్రోబుటానిల్, తెల్లదోమ సోకకుండా అసెటమీ ప్రైడ్ 0.2 గ్రాములు, 5 మి. లీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అగ్రోమిన్ మ్యాక్స్ 2.5 గ్రాములు, 19-19-19లు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి వెంటవెంటనే పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. లేతపొగనాట్లు వేరుకుళ్లు సోకి దెబ్బతినకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 2 గ్రాములు, ప్లాంటోమైసిన్ గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కలు వేరుభాగంలో పోయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పీ అనసూయ, వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్, షేక్ నజీర్, ఐ. బ్రహ్మణి, ఈ రమణయ్య, మాధవ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నారుమళ్లు జాగ్రత్త

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): వర్షాలకు వరి నారుమళ్లు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 300 ఎకరాల్లో నారుమడులు వేశారని, 10 నుంచి 15 రోజుల వ్యవధిలో 920 ఎకరాల్లో వరినాట్లు వేశారన్నారు. ప్రస్తుత వర్షాలకు 120 ఎకరాల్లో వరిపైరు, 60 ఎకరాల్లో నారుమళ్లు నీటమునిగాయని తెలిపారు. వరి పైరు, నాట్లు వేసిన పైరు 21 రోజులలోపు ఉండటంతో మళ్లీ 80 శాతం రాయితీతో విత్తనాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. రెండు రోజుల్లో పొలాల్లో నిల్వ ఉన్న నీరు వెళ్లే పరిస్థితిని బట్టి రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. నీరు నిలిచిన పొలాల్లో ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని ఆమె తెలిపారు.

చౌకదుకాణం ఏర్పాటు చేయాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీ వాసులకు అనువుగా చౌకదుకాణం ఏర్పాటు చేయాలని ఆయా కాలనీ వాసులు సోమవారం తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా కాలనీల్లో సుమారు 600 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. గతంలో వాహనం ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేవారన్నారు. గత మూడు నెలలుగా వాహనం రాకపోవడంతో పనులు మానుకొని పట్టణంలో ఉన్న చౌక దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో రానుపోను ఆటోకు రూ.100 చెల్లించాల్సి రావడంతో కూలినాలి చేసుకొనేవారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కాలనీల వాసులకు అనువుగా చౌకదుకాణం ఏర్పాటుచేయాలని కోరారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ జర్నల్‌లో 'ప్రకాశం' ఆర్టికల్

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు, విద్యార్థులు సంయుక్తంగా రూపొందించిన సాంకేతిక విశ్లేషణ పత్రం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ జర్నల్‌లో ప్రచురితం కావటం తమ కాలేజీ సమర్థతకు తార్కాణమని టెక్నికల్ డైరక్టర్ డాక్టరు కె. విజయ్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీ పరిశోధనా విభాగం డీన్ డాక్టరు లక్ష్మణరావు నేతృత్వంలో రూపొందించిన ఈ పత్రంలో ఈఈఈ విభాగం మీరావలి, విద్యార్థులు కే మౌనీషా,కేవెంకటేష్‌లు సహకరించారని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు.

పగలే వెన్నెల...!



వలేటివారిపాలెం నాలుగో వార్డులో పది రోజుల నుంచి వీధిలైట్లు రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. ఈ బిల్లు భారం పంచాయతీపై పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాల జలమయం


కొండాపురం : భీమవరప్పాడులో నీట మునిగిన వరిపైరు


వీవీపాలెం : వర్షాలకు కూలిన పొగాకు బ్యారన్

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుడడంతో జనజీవనం స్తంభించింది. సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులన్నీ బురదమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షంతో పొగాకు, శనగ పంటలు సాగు చేసే రైతులకు, సాగులో ఉన్న అరుతడి పంటలకు కొంతమేలు చేకూరింది. అయితే ఆశించిన మేర వర్షాలు కురవడంలేదని రైతులు కొంతమేర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

కూలిన పొగాకు బ్యారన్

● వలేటివారిపాలెం: గ్రామానికి చెందిన రైతు మిత్తుకుళ్ల వెంగయ్యకు చెందిన పొగాకు బ్యారన్ కురుస్తున్న భారీవర్షాలకు ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. దీంతో సుమారు రూ. లక్షకు పైగానే ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు వెంగయ్య చెప్పారు. పొగాకుబోర్డు అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కార్యాలయాల ముందు నిలిచిన వర్షపునీరు

భారీ వర్షాలకు వలేటివారిపాలెంలోని ఎమ్మార్సీ, హౌసింగ్ కార్యాలయాలు, హైస్కూల్, ఇతర కార్యాలయాల ముందు వర్షపునీరు నిలబడి, చెరువును తలపిస్తున్నాయి. దీంతో కార్యాలయాల్లోకి వెళ్లే అధికారులు, సిబ్బంది, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపునీరు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటమునిగిన వరినారుమళ్లు

● కొండాపురం : తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో ఆదివారం రాత్రి 35.2 మి.మీ వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాలకు వరినాట్లు నీటమునిగాయి. వరి నాట్లను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మెట్ట పంటలకు ఈ వర్షం తీవ్ర నష్టాన్ని చేకూర్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అలుగు పారుతున్న చెరువులు

● లింగసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది.ఈ వర్షానికి మండలంలోని చినపవని, వీఆర్ కోట చెరువులు అలుగులు పారుతోంది. విశ్వనాథపురం చెరువుకు 90 శాతం మేర నీరు చేరింది.అయితే గతంలో కురిసిన వర్షానికి ఈ చెరువులకు ఓ మోస్తరుగా నీరు చెరువుగా రాత్రి కురిసిన వర్షానికి చెరువులు నిండి అలుగులు పారుతున్నాయని రైతులు చెప్పారు.అయితే మండలంలోని మిగిలిన లింగసముద్రం కొత్త, పాత చెరువులకు, పెదపవని, మొగిలిచెర్ల చెరువులకు పెద్దగా నీరు చేరలేదని రైతులు తెలిపారు.అయితే పెదపవని, లింగసముద్రం తదితర గ్రామాలలో కురిసిన వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు ప్రవహించి రోడ్లపై నీరు నిలిచింది.

వర్షంతో వీధుల జలమయం

● సంగం : మండల కేంద్రమైన సంగంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కాలనీల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. రహదారిపైకి వర్షపునీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

● అల్లూరు : కురుస్తున్న వర్షంతో రైతులు అల్లాడుతున్నారు. ఇప్పటికే మండలంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న క్రమంలో నాలుగు రోజులుగా వర్షాలు ముంచెత్తాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. లోతట్టు ప్రాంతాల రైతులు పోసుకున్న నార్లు దెబ్బతినడంతోపాటు పొలాల్లో నీరు బయటికి వెళ్లకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

● కలిగిరి : మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో ఉదయం నుంచి విడతలుగా వర్షం కురుస్తూనే ఉండటంతో సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. ఈ వర్షంతో మినుము, పొగాకు పంటలకు మేలు చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు.

●బిట్రగుంట : బోగోలు మండలంలో మూడురోజులపాటు కుండపోతగా వర్షం కురిసి ఆగింది. అయితే సోమవారం సాయంత్రం నుంచి వళ్లీ వర్షం కురుస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన గేదె

వరికుంటపాడు, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రామాలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దాసరి రమణమ్మకు చెందిన గేదెలు రోజు మాదిరిగా మేత కోసం వెళ్లి తిరిగి ఓ గేదె ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె గాలింపు చేపట్టారు. చివరికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన గేదెను గమనించింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని వేడుకొంది.

ఏ సాగరం తహసీల్దారుగా సుభాషిణి

అనంతసాగరం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): సాగరం తహసీల్దారుగా సుభాషిణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో సుభాషిణిని బాధ్యతలు స్వీకరించారు.

చేజర్ల తహసీల్దారుగా మురళి బాధ్యతల స్వీకరణ

చేజర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండల నూతన తహసీల్దారుగా బి మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంటపాడు, కనియంపాడు గ్రామాల బొగ్గుబట్టీల వద్ద పనిచేస్తున్న వలస కార్మికులకు సోమవారం మద్దినేని ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే ఆంధ్రావారిపల్లి, తూర్పుబోయమడగల ఎస్టీ కాలనీల్లోని పేదలకు సైతం వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, నాయబ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దాడికి నిరసన

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గూండాలు చేసిన దాడిని నిరసిస్తూ సోమవారం కందుకూరులో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ జోన్ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగిన నిరసనలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బీ. వెంకటేశ్వర్లు, బాషా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి


విజయకుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్ విజయ కుమార్‌ను గుంటూరులో స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీవోలంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్, స్వచ్ఛ సేవ, ప్రకృతి వ్యవసాయం, అటవీ రక్షణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విజయకుమార్‌ను సంస్థల ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంద సేవాసంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య, కార్యదర్శి ప్రకాష్, సభ్యులు పీఎస్ మూర్తి, రాముడు, రాజారావు, సింహాద్రి, ప్రసాదం, తులసీ, నాగరాణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

నేడు కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం

సీతారామపురం, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండల కేంద్రంలోని ఎస్‌వి కన్వెన్షన్ హాలులో ఈనెల 3వ తేదీన జరిగే ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో వీపీఆర్ ఫౌండేషన్ దారా దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీచేయనున్నట్లు తెలిపారు. మండలంలోని కూటమి కార్యకర్తలందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పురపాలక సంఘ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ అడ్మిన్, ఎనిమిటీస్ సెక్రటరీలు, రెవెన్యూ ఆఫీసర్ పణికుమార్‌లతో పన్నుల వసూళ్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా వివిధ పన్నుల డిమాండ్ ఎంత ఉంది.. ఇప్పటికి ఎంత వసూళ్లు చేశారని ప్రశ్నిఆరు. పురపాలక సంఘ నిర్వహణ దృష్ట్యా పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే కాకర్ల సంతాపం

వింజమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కండే రమణయ్య ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం టీడీపీ నాయ కుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రమణయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

జీవో నెంబరు 73ని అమలు చేయాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

అనంతసాగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 73ని అమలు చేయాలని సీపీఎం నాయ కులు డిమాండ్ చేశారు. ఈమేరకు అనంతసాగరం బస్టాండ్ సెంటర్ లో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు సుభాషిణికి వినతిపత్రం అందిచారు. కార్య క్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, మీరా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

బిట్రగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పరిధి అక్కరాజువారికండ్రిక సమీపంలోని అటవీ, మేత పోరంబోకు భూములను కొందరు పెద్దలు ఆక్రమించుకుంటున్నారని, వాటిని తొలగించి గ్రామస్థులకు న్యాయం చేయాలని పసుపులేటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. ఈ విషయమై గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల బాలక్రిష్ణ, గుర్రం వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వర్లు, పసుపులేటి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మంచినీటి ట్యాంకులు

● ట్యాంకుల నుంచి పైపులకు విడుదల కాని నీరు ● గ్రామస్థుల ఇక్కట్లు


నిర్మాణం పూర్తయిన ట్యాంకు

లింగసముద్రం, డిసెంబరు 2: మండలంలోని పలు గ్రామాలలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ పథకం కింద మండలంలోని కొత్త మాలకొండరాయునిపాలెం, ముక్తేశ్వరం, శింగరపాలెం, నారసింహాపురం, ఎర్రారెడ్డిపాలెం, లింగసముద్రంలో మంచినీటి ట్యాంకులు నిర్మించారు. అయితే వీటి నిర్మాణాలు ఈఏడాది మే నెలలో పూర్తయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని పరీక్షలు పూర్తిచేశారు. ఇక ట్యాంకుల నుంచి పైపులకు నీరు వదలాల్సి ఉంది. కానీ ఈ ట్యాంకులను ఆయా గ్రామ పంచాయతీలకు గుత్తేదారులు అప్పగించలేదు. దీంతో పంచాయతీ వారు ఈ ట్యాంకుల వద్ద నీరు వదిలేందుకు పంపు మెకానిక్‌లను నియమించలేదు. ఈ కారణంగా ఈ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● సంగం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అశోక్



సంగం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి అశోక్ తెలిపారు.

? సాధారణంగా సీజనల్ వ్యాధులు దేనివల్ల వస్తాయి.

! తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ ఫీవర్ వస్తాయి. ఇవి రాకుండా వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

? సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యఆరోగ్య శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుంది.

! పరిసరాలు, డ్రైనేజీలు, మురికిగుంటలు, నిల్వ నీటిలో లార్వా చేరకుండా వైద్యఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో పంచాయతీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నాం. అలాగే దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? స్థానిక పీహెచ్‌సీలో ఓపీ ఎలా ఉంది. ఎలాంటి వ్యాధులతో ఎక్కువ మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా.

! ప్రతి నిత్యం 70 నుంచి 80 మంది వైద్యశాలకు అనారోగ్యంతో వస్తున్నారు. ఎక్కువగా జ్వరాలు, జలుబు, దగ్గుతో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

న్యూస్ బాక్స్

'మంద కృష్ణపై విమర్శలు తగవు'

కావలి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) మూడు దశాబ్దాలుగా మాదిగల ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న మంద కృష్ణ మాదిగను మహాసేన రాజేష్ విమర్శించటం తగదని ఆల్ ఇండియా బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంసన్ పేర్కొన్నారు. జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ మాదిగలను రాజేష్ చులకనగా మాట్లాడటాన్ని ఖండించారు. నీ స్థాయిమరిచి మంద కృష్ణ మాదిగను గురించి మాట్లాడే అర్హత నీకు లేదన్నారు. ఇకముందు మాట్లాడితే సహించేది లేదన్నారు. సమా వేశంలో బహు జన సంఘం జిల్లా కార్యదర్శి నల్లగట్ల జార్జి, పరుసు రమణయ్య పాల్గొన్నారు.

హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంలో నరేంద్రమోదీ నేతృత్వంలో పెరిగిపోతున్న హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు ఐక్యంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీ ప్రదీప్ పేర్కొన్నారు. కందుకూరులో సోమవారం జరిగిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత రిజర్వేషన్లను నీరుగార్చేందుకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చారని, వీటి రద్దుకోసం ఐక్యంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సాదినేని వెంకటేశ్వరరావు, ఎల్. రాజశేఖర్, ఈ. భూషణం, జగన్, గేరా చిరంజీవి, బ్రహ్మయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, టి. పోతురాజు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ

కావలిటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీఎస్‌యూ పీజీ కళాశాలలో బుధవారం నుంచి డేటా ఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బాలశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఎలాంటి ప్రవేశరుసుం ఉండదని, 3నెలలపాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 35 వయసుండి టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 63015 43185 నెంబర్‌ను ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

బీసీ కాలనీలో అధ్వానంగా రోడ్డు


అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బీసీ కాలనీలోని సజ్జల కొండయ్య ఇంటి పక్కన ఉన్న రోడ్డు బురదమయమై అధ్వానంగా ఉంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసి మీరయ్య, మరికొందరు చెప్పారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు కమ్మేయండంతో రహదారంతా మూసుకొని పోయింది. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు వారు చెప్పారు.ఈ రోడ్డు అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.